



సుండుపల్లెలో ఎన్నిక నిర్వహించాలని ఎంపీడీవోపై ఒత్తిడి చేస్తున్న ఇరువర్గాల నాయకులు

నీటి సంఘాల ఎన్నికలు.. ప్రశాంతం

జిల్లావ్యాప్తంగా శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 167 చెరువుల నీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అందులో ఐదు వాయిదా పడ్డాయి. ఈ ఎన్నికల్లో కూటమి మద్దతుదారులు విజయకేతనం ఎగుర వేశారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులు కూడా కూటమి మద్దతుదారులే గెలుపొందారు. ప్రతిపక్ష వైసీపీ నాయకులు పోటీ చేయలేదు. దీంతో కొన్నిచోట్ల తెలుగుదేశం పార్టీలోని గ్రూపులే తలపడ్డాయి. సుండుపల్లె మండలం పింఛా ప్రాజెక్టు ఎన్నిక సందర్భంగా స్థానిక ఎస్ఐపైన టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు చెదురుమదురు సంఘటనలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.



వీరబల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం

- కూటమి మద్దతుదారుల విజయకేతనం
- పోటీకి దూరంగా వైసీపీ
- రాజంపేటలో నాలుగు, తంబళ్లపల్లెలో ఒకటి వాయిదా

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3276 చెరువులు ఉన్నాయి. అయితే వంద ఎకరాల విస్తీర్ణం ఉన్న 167 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం ఉదయం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు పెట్టి ఏకాభిప్రాయం కుదిరిన చోట ఏకగ్రీవమయ్యాయి. కొన్నిచోట్ల ఎన్నికలు జరిగాయి. అయితే అధికశాతం ఏకగ్రీవం కావడం విశేషం. ఇవన్నీ అధికారంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మద్దతుదారులే దక్కించుకున్నారు. కొన్నిచోట్ల తెలుగుదేశం పార్టీలోని గ్రూపులే ఆధిపత్య పోరులో భాగంగా తలపడ్డాయి. ఎక్కువగా తంబళ్లపల్లె నియోజకవర్గం ఆరు మండలాల్లో 37 చెరువులు, పెద్దేరు ప్రాజెక్టుకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.

- రాయచోటి నియోజకవర్గంలో 15 చెరువులు ఉండగా అన్నీ ఏకగ్రీవంగా తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు గెలుచుకున్నారు. రాయచోటి మండలంలో మూడు చెరువులు, చిన్నమండెంలో రెండు, సంబేపల్లెలో రెండు, లక్కిరెడ్డిపల్లెలో రెండు, గాలివీడు రెండు, రామాపురం మండలంలో మూడు చెరువులు ఉన్నాయి. ఇక్కడ ఎన్నికలను రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, భార్య హరిత పర్యవేక్షించారు.
- పీలేరు నియోజకవర్గంలో 18 చెరువులకు గాను అన్నింటినీ కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. పీలేరు మండలంలో మూడు చెరువులు, గుర్రంకొండ ఐదు, కలికిరి రెండు, కలకడ రెండు, వాల్మీకిపురం మండలంలో ఆరు చెరువులకు ఎన్నికలు జరిగాయి.
- రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో 83 చెరువులు ఉన్నాయి. 79 సంఘాలకు ఎన్నికలు జరిగాయి. నాలుగు వాయిదా పడ్డాయి. నియోజకవర్గంలోనే పెద్దదైన సుండుపల్లె మండలం పింఛా ప్రాజెక్టు ఎన్నికలు వాయిదా పడ్డాయి. నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలసుబ్రమణ్యం, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దీంతో ఇక్కడ ఇరువర్గాలు తమ వర్గీయులే ఎన్నిక కావాలని పట్టుపడుతున్నారు. దీంతో ఇక్కడ ప్రతిపక్ష వైసీపీ బరిలో లేకపోయినా ఎన్నిక వాయిదా పడింది. దీనిపైన స్థానికంగా రైతులు, టీడీపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి వీరబల్లి మండలంలోనూ ఉంది. ఈ నాయకుల ఆధిపత్య పోరు వల్లే వీరబల్లిలో కూడా ఎన్నికలు వాయిదా పడ్డాయి. పెనగలూరు మండలం ఇండ్లూరు ఊటకాలువ, ఓబులవారిపల్లె మండలంలో వై.కోట చెరువుకు ఎన్నికలు జరగలేదు. ఇక్కడ కూటమి నేతల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడం, పంతాలకు పోవడం వల్ల ఈ రెండు స్థానాల్లో వాయిదా పడింది.
- మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు, నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టులతో పాటు 53 చెరువులు ఉన్నాయి. శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో పెద్దమండ్యం మండలంలోని పాపిరెడ్డిచెరువు ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన రెండు ప్రాజెక్టులు, 52 చెరువులకు ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా జరిగాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం మండలాల్లో 38 చెరువులు, పెద్దేరు ప్రాజెక్టు ఉన్నాయి. మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 15 చెరువులు, నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టు ఉన్నాయి. ఇందులో అన్ని చెరువులకు ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. అలాగే నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టులోని ఆరు టీసీల్లో ఒకటో టీసీకి ఎన్నిక జరగ్గా, మిగిలిన అయిదు టీసీలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నిక జరిగిన ఒకటో టీసీలో సమీప ప్రత్యర్థి రెడ్డెప్పపై భాస్కర్‌రెడ్డి విజయం సాధించారు. ఇక్కడ టీసీకి ఎన్నిక జరగ్గా, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక మాత్రం ముందుగానే ఏకగ్రీవమైంది. ఇందులో రెండు ప్రాజెక్టులు సహా చెరువులన్నీ కూటమి ప్రభుత్వమే గెలుచుకుంది.



మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లెలో ఎన్నికలు నిలిపివేయాలని బైఠాయించిన టీడీపీ నాయకులు

- పింఛా ప్రాజెక్టు ఎన్నిక సందర్భంగా ఉద్రిక్తత ఏర్పడింది. ఇక్కడ స్థానిక ఎస్ఐ పైన టీడీపీ కార్యకర్తలు చేయి చేసుకున్నారు. ఎస్ఐపైన చేయి చేసుకున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అధికారులు సైతం పకడ్బందీ చర్యలు చేపట్టారు.

ఎన్నికలకు దూరంగా వైసీపీ

ఆరు నెలల క్రితం అధికారం కోల్పోయిన వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పిలుపు ఇవ్వడంతో కొన్నిచోట్ల ఆ పార్టీకి మెజార్టీ ఉన్నప్పటికీ వాళ్లు బరిలో నిలవలేదు. దీనిపైన వైసీపీ కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గెలుపో? ఓటమో? పోటీ చేసి ఉండాల్సిందని అభిప్రాయపడుతున్నారు.

పటిష్ట బందోబస్తు

- పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, రాజంపేట సబ్ డివిజన్ల పరిధిలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలకు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేయడంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఎక్కడా ఎలాంటి గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాట్లతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని గ్రామాల్లో ఎటువంటి గొడవలు పెట్టుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎక్కడైనా సమస్యలు సృష్టించాలని చూస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశారు. ప్రశాంతంతా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఎస్పీ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆదేశించడంతో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పుట్టినరోజు వేడుకకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి





మృతి చెందిన కిరణ్, బన్నీనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ స్నేహితులు.. వారిలో ఒకరిది పుట్టినరోజు.. ఆ స్నేహితుడి పుట్టినరోజు ఘనంగా జరుపుదామని మరో స్నేహితుడు చెన్నై నుంచి ఇక్కడికి వచ్చాడు. విధి వక్రీకరించి వారిద్దరిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. వివరాలిలా ఉన్నాయి. నంద్యాలకు చెందిన కిరణ్ (20) రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అతడికి శనివారం పుట్టినరోజు. కిరణ్ స్నేహితుడైన పులివెందులకు చెందిన బన్నీనాథ్ రెడ్డి (20) చెన్నైలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా ఆనందంగా గడపాలని అతను చెన్నై నుంచి రాజంపేటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో ఇద్దరూ కలిసి పుట్టినరోజును ఘనంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ కలిసి మోటార్ బైక్‌లో రాజంపేట టౌన్ నుంచి కాలేజీకి వస్తుండగా బైక్ అదుపు తప్పి కడప నుంచి తిరుపతి వైపు వెళుతున్న బస్సును ఢీకొంది. దీంతో ఇరువురి తలలకు తీవ్రగాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి వారు మృతి చెందారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి మృతదేహాలను తరలించారు. కాగా చనిపోయిన విద్యార్థుల కుటుంబీకులు ఈ దుర్ఘటన విషయం తెలుసుకుని ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. శనివారం రాత్రి తమ బిడ్డల మృతదేహాల వద్దకు చేరుకుని తీవ్ర విషాదంతో రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయారు. పుట్టినరోజు చేసుకునే తన సహచరుడు, వేడుకల కోసం వచ్చిన ప్రాణ స్నేహితుడు ఇరువురు చనిపోవడంతో సహచర ఇంజనీరింగ్ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం వద్దకు చేరుకుని అనేకమంది విద్యార్థులు అర్ధరాత్రి వరకు పోస్టుమార్టం ప్రాంగణంలోనే ఉండడం అందరినీ కలిచివేసింది.

మంత్రి దిగ్భ్రాంతి

రాజంపేటలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడుపుతూ యువత ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడంతోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆస్పత్రి మార్చురీ వద్ద వేచి ఉన్న మృతుల స్నేహితులు

మంచు మృత్యువు

- శీతాకాలం...వాహనదారులకు పరీక్షా సమయం
- అవగాహన, అప్రమత్తతతో సురక్షిత ప్రయాణం

6



పీలేరు-తిరుపతి మార్గంలో పొగమంచులో వాహనాలు

కుప్పకూలిన టమోటా ధరలు

- కిలో రూ.2 నుంచి రూ.8
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- తోటల్లోనే కాయలు
- ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గడంతో పడిపోయిన ధర



ములకలచెరువు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు కుప్పకూలాయి. ములకలచెరువు మార్కెట్‌లో శనివారం టమోటా ధరలు రైతులను ముంచాయి. 23 కేజీల బాక్సు నాణ్యతను బట్టి రూ.50 నుంచి రూ.200 మాత్రమే పలికాయి. కిలో ప్రకారం చేస్తే రూ.2 నుంచి రూ.8 మాత్రమే. పది రోజుల క్రితం వరకు రూ.1400 పలికిన బాక్సు ధర వారం రోజులుగా తగ్గుముఖం పట్టింది. వారం రోజుల వ్యవధిలో బాక్సుకు రూ.1200 వరకు తగ్గిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ధరలు లేకపోవడంతో కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు అమ్మకానికి టమోటాలు రావడం భారీగా తగ్గిపోయాయి. ఇక్కడి నుంచి టమోటాలు మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ఎగుమతి అవుతున్న రాష్ట్రాల్లో టమోటా సాగు పెరగడం, భారీగా దిగుబడి వస్తుండడంతో ఇక్కడి టమోటాలకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి కేవలం తమిళనాడు రాష్ట్రానికి మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. టమోటా ధరలు భారీగా పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

జగనన్న కాలనీలో స్థలాలు అమ్మేశారు..

- అగ్రిమెంట్‌పై విక్రయాలు
- రద్దుకు నో చాన్స్

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పథకాల్లో భాగంగా నిర్మించిన జగనన్న కాలనీలు వలంటీర్లకు లాభాల పంట పండించాయి. గతంలో అన్ని ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలను కేటాయించి ఆరునెలల్లోగా నిర్మించుకోవాలని, లేకుంటే పట్టాలు రద్దు చేస్తామని నిబంధనలు పెట్టేవి. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అనర్హులకు ఏకంగా ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేయడంతో వాటిని రద్దు చేసే అవకాశం లేకుండాపోయింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అటు వైసీపీ నాయకులు, ఇటు వలంటీర్లు అందినకాడికి ఇళ్ల స్థలాలను అనర్హులకు కేటాయించడమే కాక, బినామీ పేర్లతో వారే సొంతం చేసుకున్నారు. ఈ ఇళ్ల స్థలాలను అగ్రిమెంట్ పేరుతో విక్రయించి కోట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెడితే అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూమి సేకరించే ఇబ్బందులు తప్పుతాయి. మదనపల్లె పట్టణంలోని నిరుపేదలకు నవరత్నాల పథకంలో భాగంగా పదివేల మందికి మండలంలోని మూడుచోట్ల ఇళ్ల స్థలాలు కేటాయించారు. వీటిలో మండలంలోని పోతబోలు సమీపంలోని బాచేపల్లె వద్ద 3200 మంది లబ్ధిదారులకు ఒకేచోట ఇళ్ల స్థలాలను కేటాయించారు. మూడేళ్ల క్రితం దీనికోసం 90 ఎకరాల ప్రభుత్వ, డీకేటీ భూములను సేకరించారు. అంతేకాకుండా మోడల్ లేఅవుట్ వేసి లబ్ధిదారులకు ఒకటిన్నర సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. అంతా బాగానే ఉంది కానీ అర్హులైన లబ్ధిదారులకు కాకుండా వైసీపీ నాయకులు చెప్పిన వారికి, వలంటీర్లు చెప్పిన వారికి ఇష్టారాజ్యంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పట్లో లబ్ధిదారులు రూ.1 చెల్లిస్తే ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇచ్చేశారు. దీంతో ఐదేళ్ల తరువాత ఈ ఇళ్ల స్థలాలను విక్రయించుకునే వెసులుబాటు కూడా కల్పించారు. 3,200 మంది లబ్ధిదారుల్లో 30శాతం అనర్హులకే కేటాయించారని అప్పట్లో విమర్శలు కూడా వచ్చాయి.

అగ్రిమెంట్లతో విక్రయాలు

పోతబోలు సమీపంలోని బాచేపల్లె వద్ద మోడల్ లేఅవుట్‌లో 3,200 ఇళ్ల స్థలాలు కేటాయించగా వీటిలో సుమారు 1000 ఇళ్ల స్థలాలు వైసీపీ నాయకులు బినామీలు, వలంటీర్ల బినామీలకు కేటాయించారు. ఈ స్థలాలను బినామీలకే రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇచ్చారు. ఈ స్థలాలు కేటాయించి మూడేళ్లు గడుస్తున్నా వందల సంఖ్యలోస్థలాల్లో పునాదులు కూడా నిర్మించలేదు. మిగిలిన వాటి బేస్‌మెంట్ లెవెల్, గోడలు నిర్మించి వదిలేశారు. ఇలాంటి అసంపూర్తి నిర్మాణాలను చాలామంది ప్రభుత్వం మారుతూనే బేరాలు పెట్టి విక్రయించేశారు. లోతుగా విచారిస్తే ఈ స్థలాలను కొంతమంది ఒక్కో ప్లాటుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు అగ్రిమెంట్ మీద విక్రయించారని తెలిసింది. అసలు లబ్ధిదారులు ఎక్కడో ఉంటే, తక్కువ ధరకే ప్లాటు వస్తుందని కొన్న వారు అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఈ ఇళ్ల స్థలాల్లో పునాదులు నిర్మించకుంటే కనీసం రద్దు చేసే అవకాశం కూడా లేకపోవడంతో ఈ స్థలాల విక్రయాల ద్వారా సుమారు రూ.కోటిన్నర దాకా అక్రమార్కుల చేతులు మారినట్లు సమాచారం. దీనిపై హౌసింగ్, రెవెన్యూ అధికారులు లోతుగా విచారిస్తే అసలు గుట్టు బయటపడుతుంది.

మదనపల్లె పట్టణానికి చెందిన నిరుపేదలు 7,662 మందికి మండలంలోని బాచేపల్లె, కోళ్లబైలు, బీకేపల్లె పామయ్యగారిపల్లె ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. వీటిలో 4,335 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి వివిధ స్థాయిల్లోని నిర్మాణాలకు ప్రభుత్వం రూ.14,89,863 బిల్లులు చెల్లించింది. వీటిలో చాలా ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఇలాంటి వాటినే దళారులు తక్కువ ధరలకు ప్లాట్లు ఇస్తామని అగ్రిమెంట్ల మీద విక్రయించేశారు. దీనిపై రెవెన్యూ, హౌసింగ్ అధికారులు లోతుగా విచారిస్తే అసలైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వెసులుబాటు కలుగుతుంది. కాగా మదనపల్లె మండలంలో ఇప్పటివరకు వివిధ దశల్లో మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులందరికీ మొత్తం రూ.44,15,13,041 ప్రభుత్వం చెల్లించింది.

308 పట్టాలు రద్దు చేశాం..

బాచేపల్లె లేఅవుట్‌లో మూడేళ్లు గడిచినా ఇంతవరకు ఇళ్ల నిర్మాణం ప్రారంభించని 308 మందికి ఇళ్ల పట్టాలను రద్దు చేశాము. మిగిలిన ప్రాంతాల్లోని లేఅవుట్‌లను కూడా పరిశీలిస్తున్నాం. ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వ ఆదేశాలతో తదుపరి చర్యలు చేపడతాము.

- దీనదయాళ్ రాజు, హౌసింగ్ ఏఈ, మదనపల్లె అర్బన్



మదనపల్లె మండలం పోతబోలు సమీపంలోని బాచేపల్లె హౌసింగ్ లేఅవుట్



పునాదుల వరకే నిర్మించిన హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు

కంటిచూపు పోతోంది

- చిన్నపిల్లల్లో మయోపియా వ్యాధి
- 1-15 ఏళ్ల పిల్లల్లో 50 శాతం మందికి
- ఇందుకు తల్లిదండ్రులూ కారణమే

6

కంటిచూపు పోతోంది

- చిన్నపిల్లల్లో మయోఫియా వ్యాధి
- 1-15 ఏళ్ల పిల్లల్లో 50 శాతం మందికి
- ఇందుకు తల్లిదండ్రులూ కారణమే

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో చిన్నపిల్లలకు కంటి చూపు తగ్గిపోతోంది. ఏడాది నుంచి 15 సంవత్సరాల చిన్నపిల్లలకు, తల్లిదండ్రులు మొబైల్ అలవాటు చేయడం వల్ల వారికి కంటిచూపు మందగించి మయోఫియా అనే జబ్బు భారిన పడి జీవితాంతం కంటి అద్దాలు వాడే పరిస్థితికి కొనితెచ్చుకుంటున్నారు. సెల్‌ఫోన్, టీవీలు గంటల తరబడి చూడడం వల్ల ఈ జబ్బు వస్తుందని నిపుణులు ఓ పరిశోధనలో వెల్లడించారు. ఒక్కసారి ఈ వ్యాధి వచ్చిన పిల్లలకు జీవితాంతం చూపు మందగిస్తూనే ఉంటుందని, వారు కంటి అద్దాలు వాడక తప్పదని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా చిన్నపిల్లలకు కంటి చూపు తక్కువ మోతాదులో ఉంటుంది. చిన్నపిల్లలకు గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పోషక పదార్థాలు పెట్టి కంటి చూపు పెంచుకోవడానికి ప్రయత్నం చేయకుండా తల్లిదండ్రులు సెల్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల ఉన్న కంటి చూపుపోయి వారికి కంటి అద్దాలు తెచ్చుకునే పరిస్థితులు దాపురిస్తున్నాయని డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి కంటి అద్దాలు వాడే పిల్లలకు 40 సంవత్సరాల తర్వాత ఎటువంటి చూపు ఉండకపోవచ్చని ఒక పరిశోధనలో వెల్లడైనట్లు తెలిసింది. జన్యుశాస్త్రం ప్రకారం తల్లిదండ్రుల్లో ఒకరికి సైట్ వస్తే వారి పిల్లలకు అది మూడు రెట్లు ప్రభావం చూపుతుందని డాక్టర్లు ఒక అంచనాకు వచ్చారు.


రాజంపేటలో పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభంజన్‌కుమార్ (ఫైల్)

కంటి చూపు మందగించడానికి కారణాలు

చిన్నపిల్లలు బయట గ్రౌండ్‌లో ఆడుకోకపోవడం, స్కూల్ నుంచి ఇంటికి రాగానే సెల్‌ఫోన్ పట్టుకుని గంటల తరబడి చూడడం వల్ల ఈ మయోఫియా వ్యాధి వస్తుందని డాక్టర్లు పరిశోధనలో వెల్లడించారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర పూర్తిగా ఉన్నట్లు కూడా వారు అంచనాకు వచ్చారు. తల్లిదండ్రుల్లో ఒకరికి సైట్ వస్తే ఖచ్చితంగా వారి పిల్లల్లో ఒకరికి సైట్ వస్తుంది. సెల్‌ఫోన్‌లో వీడియోగేమ్, క్రికెట్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు అని రకరకాల దృశ్యాలను చూడడం వల్ల చిన్న పిల్లలు కంటి చూపు కోల్పోతారని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగాల బిజీలో పడి పిల్లలకు సెల్‌ఫోన్లు అలవాటు చేయడం వల్ల ఐదేళ్ల లోపు పిల్లలు ఈ వ్యాధి భారిన పడి నరకం అనుభవిస్తున్నారని కంటి వైద్యనిపుణులు చెబుతున్నారు. చిన్నపిల్లలు కనీసం ఎండలో రెండు గంటల పాటు ఆడుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. సాధారణ ప్రకృతి సూర్యరశ్మి వల్ల కంటి చూపు సమస్యలు రావని, ఒక వేళ వచ్చినా ఎక్కువ శాతం ప్రభావితం చూపవని వైద్యులు నిర్ధారించారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం చిన్న పిల్లల్లో కంటి వ్యాధులు ఎక్కువగా ఉన్న పరిస్థితులు మనం చూస్తున్నాం. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను కంటి డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించాలి. పిల్లలను గారాబం చేసి సెల్‌ఫోన్‌లకు, టీవీలకు అలవాటు చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు సెల్‌ఫోన్‌లకు అడిక్ట్ అయిపోతే అనంతరం తల్లిదండ్రులు బాధపడాల్సి వస్తుంది. ముందుగానే వాటిని చిన్నారులకు దూరంగా ఉంచేలా చూసుకోవాలి.

-డాక్టర్ కొండయ్య, డీఎంహెచ్‌వో, అన్నమయ్య జిల్లా

ఫోన్‌లు పిల్లలకు దూరంగా ఉంచాలి



చిన్నపిల్లలకు స్మార్ట్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల వారు దగ్గర దృష్టి, దూర దృష్టి రెండు కోల్పోతారు. చిన్నపిల్లలకు పాలు, గుడ్లు, ఆకుకూరలు పండ్లతో పాటు మంచి విటమిన్స్ లభించే ఆహార పదార్థాలు ఇవ్వాలి. పానీపూరి, గోబి మంజూరియా, చాక్లెట్, బిస్కెట్స్, పిజ్జా అలవాటు చేయకూడదు. వారానికి రెండుసార్లు అయినా బయట ఎండలో ఆడుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలి. అప్పుడే కంటికి సంబంధించిన వ్యాధులు రాకుండా నివారించవచ్చు.

- శ్రీనివాస్, రాయచోటి ఆర్డీవో

పిల్లలకు స్మార్ట్‌ఫోన్ అలవాటు చేయొద్దు



ఏడాది నుంచి 15 సంవత్సరాల వయస్సు గలవారికి స్మార్ట్‌ఫోన్ అలవాటు చేసి తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారు. కనీసం వారానికి మూడుసార్లైనా పిల్లలు బయట ఎండలో ఆడుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలి. పిల్లలను గారాభం చేసి సెల్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల వారికి కంటి చూపు మందగించి రాబోవు రోజుల్లో వారు అంధహీనులుగా మిగిలిపోతారు. ఈ విషయాన్ని ప్రతి తల్లి తండ్రి ఆలోచించి ముందు జాగ్రత్తగా పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడం మానుకోవాలి.

- ప్రభంజన్‌కుమార్, కంటి వైద్యనిపుణుడు, స్విమ్స్ తిరుపతి

జాతీయ మెగా లోక్‌అదాలత్ విజయవంతం





రాయచోటిలో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా అయిదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, ఇతర జడ్జిలు - లోక్‌అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జడ్జిలు

రాయచోటి టౌన్, డిసెంబరు 14 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఐదవ జిల్లా అదనపు జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 130 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు పరిధిలోని వివిధ మండలాల్లో జరిగిన యాక్సిడెంట్, చెక్‌బౌన్స్, సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన 130 కేసులను జిల్లా అయిదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానాలు పూర్తిస్థాయిలో విచారించి ఇరువర్గాలతో మాట్లాడి రాజీమార్గం ద్వారా 130 కేసులను పరిష్కరించి రూ.కోటి 84 లక్షల 53 వే 539 రూపాయలు జరిమానా విధించడంతో పాటు చెల్లింపులు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ వారు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.7.44 కోట్ల పరిహారం

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోర్టులో శనివారం రాత్రి వరకు నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 313 కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టు భవన సముదాయాల్లో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శిరీష్, రెండవ అదనపు మేజిస్ట్రేట్ కీర్తన, స్పెషల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చలపతి ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 44 సివిల్ కేసులు, 269 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా వీటిలో బాధితులకు రూ.7,44,33,578 పరిహారం చెల్లించారు.

కేసుల సత్వర పరిష్కారం

వాల్మీకిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు సత్వర పరిష్కార వేదిక జాతీయ లోక్‌అదాలత్ అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ గురు అరవింద్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంతో కక్షలకు పోయి కేసులతో జీవితాలను దుర్భరం చేసుకోకుండా ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి నిత్యం కోర్టులలో సింగిల్‌సిట్టింగ్ నిర్వహించడం జరుగుతుందని కక్షిదారులు దానిని సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, తదితర మొత్తం 144 కేసులు, నగదు రికవరీలు రూ.57,72,880 పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు రాంప్రసాద్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ లో 115 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ఇన్‌చార్జ్ న్యాయమూర్తి విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన మెగా లోక్‌అదాలత్ జరిగింది. సీసీ(ఐపీసీ) సంబంధించిన కేసులు 20, సీసీ (అడ్మిషన్) కేసులు 6, ఎస్‌పీసీ (అడ్మిషన్) కేసులు 62, సీసీ ఎక్సైజ్ కేసులు 20, ఓయస్ పార్టిషన్ 4, ఓయస్ (పీఐ) రెండు కేసులు పరిష్కరించి రూ.3,59,545 ఫైన్ వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రామచంద్ర, పోలీసులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

బతుకు భారమై..

ఆటో నడుపుతూ..

- ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ
- రుణం ఇప్పించాలని వేడుకుంటున్న గిరిజన మహిళ


తన పిల్లలతో కలిసి ఆటోలో గంగమ్మ

కొండాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా అవి అందరికీ చేరడం లేదు. భర్త అనారోగ్యంతో ఉండటంతో కుటుంబ పోషణ భారమై ఆటో నడుపుతూ తోబుట్టువులు, తన తల్లిదండ్రులను పోషిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది గిరిజన మహిళ పగడాల గంగమ్మ.


పూరి గుడిసెలో నివాసం ఉంటున్న గంగమ్మ

ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తూ...

కొండాపురం మండలంలోని గండ్లూరు ఎస్టీ కాలనీలో గంగమ్మ కుటుంబం ఒక పూరి గుడిసెలో ఉంటోంది. గంగమ్మకు భర్త రవితో పాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. నలుగురు చెల్లెల్లు. ఒక తమ్ముడు ఉన్నాడు. తల్లిదండ్రులు అరుణ, గంగన్న ఉన్నారు. వీరంతా గంగమ్మతోనే ఉంటూ జీవనం గడుపుతున్నారు. భర్త రవికి తల్లిదండ్రులు లేకపోవడంతో గంగమ్మతో పాటు ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. గంగమ్మతో పాటు తండ్రి గంగన్న మాత్రమే కుటుంబాన్ని పోషిస్తున్నారు. భర్తకు అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు.

గంగమ్మ అమ్మ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటోంది. తన తోబుట్టువులు నలుగురు చిన్నపిల్లలు. వీరిని బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తోంది గంగమ్మ. తన పిల్లలు పసిపిల్లలు. దీంతో కుటుంబపోషణ భారం కావడంతో కూలీ పనులకు వెళ్లకుండా, తన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి ఆటో నేర్చుకుంది. బతుకుబండి నడిపేందుకు తన బంధువుల వద్దనున్న పాత ఆటోను అద్దెకు తెచ్చుకుంది. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆటోలో కూలీలను పనులకు తీసుకెళుతూ, బడిపిల్లలను తన ఆటోలో తీసుకెళుతూ జీవనం సాగిస్తోంది. ఆటో నడుపుతూ రోజూ రూ.300 వరకు సంపాదిస్తూ నేటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. సంపాదన తక్కువ కావడంతో ప్రభుత్వం ఉపాధి కోసం తగిన ఆర్థిక సహాయం అందించాలని గంగమ్మ వేడుకొంటోంది.

కాళ్లరిగేలా తిరిగినా రుణం లేదు..

గంగమ్మ ఇల్లు గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురయింది. దీంతో ఇల్లు కోల్పోయి పూరిగుడిసెలో నివాసం ఉంటోంది. పాత ఆటో బాడుగకు తీసుకొని నడుపుతోంది. ఆటో కోసం బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా తనకు బ్యాంకులు రుణం ఇవ్వలేదని గంగమ్మ కన్నీటి పర్యంతమవుతోంది. అంతేగాక గండికోట నిర్వాసితుల జాబితాలో తన పేరు చేర్చకపోవడంతో పరిహారం రాక పూరి గుడిసెలోనే నివాసం ఉన్నామంటూ చెబుతోంది గంగమ్మ.

ప్రభుత్వం సహాయం అందించాలి..

గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా తనకు సహాయం అందలేదు. ఆటో కొనుక్కోవడానికి ఒక గిరిజన మహిళగా తనకు ప్రభుత్వ సహాయం అందించాలని వేడుకుంటోంది. పూరి గుడిసెలో ఉన్న తమకు ఇళ్లు, ఇళ్ల స్థలం ఇవ్వాలి. అదే విధంగా గండికోట ప్రాజెక్టు కింద పరిహారం ఇవ్వాలని గంగమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

సీటీఎం మిల్లు కార్మికులకు వేతనం మంజూరు

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీటీఎం మిల్లులో పనిచేసిన కార్మికులకు 23 నెలల వేతనం మంజూరైనట్లు ఎంఎస్ఎం వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు వై.రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిల్లు లాకౌట్ సమయంలో 311 మంది కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను కార్మికశాఖ కమిషనర్ మంజూరు చేశారని రాజారెడ్డి తెలిపారు.

మంచు మృత్యువు

- శీతాకాలం...వాహనదారులకు పరీక్షా సమయం
- అవగాహన, అప్రమత్తతతో సురక్షిత ప్రయాణం

పీలేరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి ఏడాదిలో డిసెంబరు, జనవరి మాసాల్లో పొగమంచు అధికంగా ఉంటుంది. వరుస తుఫాన్‌ల కారణంగా ఈ ఏడాది మరింత ఎక్కువగా పొగమంచు కురుస్తోంది. పొగమంచు కారణంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. పొగమంచు ఉన్నప్పుడు రోడ్లపై డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరం. అందుకే చలికాలంలో డ్రైవింగ్ చేయడం అంత తేలికైన పనికాదు. పొగమంచు కారణంగా రోడ్లపై ఏమీ త్వరగా కనిపించదు. దీని కారణంగా ప్రమాదం మరింత ఎక్కువ అవుతుంది.


మీరు పొగమంచులో డ్రైవ్ చేయబోతున్నట్లైతే కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. శీతాకాలంలో డ్రైవింగ్ చేసేటప్పుడు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు, మెలకువలు పాటించాలని, లేకపోతే ప్రమాదాల బారినపడే ప్రమాదం పొంచి ఉంటుందని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు. పీలేరు ఎంవీఐ విజయకుమారి శీతాకాలంలో వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలను కొన్ని వివరించారు.

రాత్రి ప్రయాణం అస్సలే వద్దు....

చీకటి పడిన తరువాత నుంచి ఉదయం 7 గంటల వరకు దూర ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ఆ సమయంలో విశ్రాంతి తీసుకుని బాగా ఎండ వచ్చాక ప్రయాణం ప్రారంభించడం ఉత్తమం.

నెమ్మదిగా డ్రైవ్ చేయాలి...

పొగమంచులో వాహనాలను వేగంగా నడపరాదు, నెమ్మదిగా నడపాలి. పొగమంచు కారణంగా రహదారిపై ముందు వెళ్లే వాహనాలు స్పష్టంగా కనిపించవు. కాబట్టి అధిక వేగం వల్ల ప్రమాద తీవ్రత పెరుగుతుంది. ముందు వెళ్లే వాహనాలకు మన వాహనానికి దాదాపు 100 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. మంచు పూర్తిగా తగ్గిన తరువాత సాధారణంగా వేగం పట్టుకుంటే గమ్యానికి సురక్షితంగా చేరుకోవచ్చు.


పీలేరు-తిరుపతి మార్గంలో పొగమంచులో వాహనాలు


పీలేరు-కడప మార్గంలో...

ఓవర్‌టేక్ చేయరాదు

దట్టమైన పొగమంచులో డ్రైవింగ్ చేసేటప్పుడు ఓవర్‌టేక్ చేయరాదు. పొగమంచులో దూరాన్ని నిర్ధారించడం కష్టం కాబట్టి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. ముందున్న ఇతర వాహనాల డ్రైవర్లు పరధ్యానంలో ఉంటే ఢీకొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఫాగ్ లైట్లు ఉపయోగించాలి

పొగమంచు సమయంలో హై బీమ్ లైట్లను ఉపయోగించరాదు. ఎందుకంటే అవి పొగమంచులో ప్రకాశాన్ని పెంచుతాయి. దీని కారణంగా రహదారి అస్పష్టంగా కనిపిస్తుంది. లోబీమ్ ఉండే ఫాగ్ లైట్లను ఉపయోగించాలి. ఎందుకంటే అవి పొగమంచులో చొచ్చుకుపోవడానికి, రహదారిపై ముందుకు వెళ్లడానికి సహాయపడతాయి.

అకస్మాత్తుగా బ్రేక్ వేయొద్దు

పొగమంచులో సడన్ బ్రేక్‌లు వేయడం వల్ల కారు స్కిడ్ అయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది. అందువల్ల నెమ్మదిగా డ్రైవ్ చేయాలి. ఇండికేటర్‌లను సరిగ్గా ఉపయోగించాలి. తద్వారా వెనుక వచ్చే వాహనాల డ్రైవర్లు కారు ఎటువైపు తిరుగుతుందో అర్థం చేసుకోగలరు.

డీఫాగర్‌ను ఉపయోగించండి

పొగమంచు వల్ల మీ వాహనం విండ్‌షీల్డ్‌పై నీరు పేరుకుపోతుంది. ఇది ముందువైపు వ్యూను మరింత తగ్గిస్తుంది. కాబట్టి డీఫాగర్‌ను ఆన్ చేయాలి. ఇది కాకుండా మీరు విండ్‌షీల్డ్ వైపర్‌లను కూడా ఉపయోగించవచ్చు. సురక్షితమైన డ్రైవింగ్ కోసం విండ్‌షీల్డ్‌ను శుభ్రంగా ఉంచడం చాలా ముఖ్యం.

హజార్డ్ లైట్లను ఉపయోగించాలి

అన్ని వాహనాలకు పార్కింగ్ లైట్ల కోసం ప్రత్యేక బటన్ ఉంటుంది. ఆ బటన్‌ను నొక్కడం ద్వారా వాహనం నాలుగు వైపులా సూచికలు ఏకకాలంలో వెలిగించడం మంచిది. వీటిని హజార్డు లైట్లు అని కూడా అంటారు. ఈ లైట్లను ఉపయోగించడం ద్వారా దూరం నుంచి, వెనుక, ముందు వచ్చే వాహనాలను చూడవచ్చు.

జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవు



చలి కాలంలో వాహనాలు, డ్రైవర్లకు పొగమంచు ప్రధాన శత్రువు. మంచు కారణంగా రోడ్డు స్పష్టంగా కనిపించదు. సాధారణంగా నడిపినట్లు మంచు వాతావరణంలో కూడా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయి. అనుభవజ్ఞులు, సుశిక్షుతులైన డ్రైవర్లకు ప్రతికూల వాతావరణంలో వాహనాలు నడిపిన అనుభవం ఉంటుంది కాబట్టి వారు జాగ్రత్త పడగలరు. స్వంతంగా వాహనాలు నడిపేవారు, కొత్తగా వాహనాలు తీసుకున్న వారు, ఉదయం పూట ప్రయాణాలు పెట్టుకున్న వారు కచ్చితంగా జాగ్రత్తలు తెలుసుకోవాల్సిందే. ప్రయాణాలకు ముందురోజు తాము ప్రయాణం చేయాల్సిన మార్గం, అందులోని వాతావరణం, ఆ వాతావరణంలో పాటించాల్సిన జాగ్రత్తలను విధిగా తెలుసుకుంటే సురక్షితంగా గమ్యం చేరవచ్చు.

-విజయ కుమారి, ఎంవీఐ, పీలేరు

రాజీ మార్గమే రాజమార్గం

● లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

● జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

కడప రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు తమ సమస్యలను లోక్ ఆదాలత్‌లో రాజీమార్గంతో పరిష్కరించుకుని తద్వారా సత్వర న్యాయం పొందడంతో పాటు డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. ఇక్కడ ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అప్పీల్‌కు వెల్లడానికి వీలు పడదన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇప్పటికే కోర్టులలో దాఖలై విచారణకు వేచి ఉన్నవే కాక కోర్టులో దాఖలు కాని సమస్యలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కోర్టుల జడ్జిలు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,553 కేసులకు అవార్డులు

ఉమ్మడి జిల్లాలోని వివిధ కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 6,553 కేసులకు అవార్డులు ఇచ్చినట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఇందుకు రూ.6,72,21,635 చెల్లింపులు జరిగాయన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్ చొప్పున ఏర్పాటు చేసి లోక్ అదాలత్‌కు వచ్చిన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించామన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అవార్డు పొందిన యాక్సిడెంట్ కేసుకు సంబంధించి బాధితుని తరుపు వారికి రూ.83 లక్షల చెక్కును అందజేశామన్నారు.

రూ.60 వేల నగదు చోరీ



పైకప్పు రేకులు కోసిన దృశ్యం

చాపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో మహేశ్వర్‌రెడ్డికి చెందిన దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి రూ.60 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తూ ఎస్‌బీఐ ఏజెంట్‌గా ఉండేవాడు. ప్రజలతో లావాదేవీలు జరుపుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కొంత నగదు, సెల్‌ఫోన్ షాపులోనే ఉంచి ఇంటికి వెళ్లాడు. కాగా అదేరోజు అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు దుకాణం పైకప్పు రేకులను మిషన్‌తో కోసి దుకాణంలోకి దిగి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల పొడవుతో రేకులను కోసి రంధ్రం వేశారన్నారు. దుకాణదారుడు లక్ష్మీపేట గ్రామానికి చెందినవాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అమ్మమ్మ మృతితో..

● హత్యకు గురై రెండేళ్ల కిందట తల్లి..

● అనారోగ్యంతో తండ్రి తనువు చాలించారు ● కొండపేటలో విషాదగాథ

అనాథలుగా చిన్నారులు



మృతదేహం వద్ద అమాయకంగా ఉన్న చిన్నారులు

చెన్నూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభం.. శుభం.. తెలియని ఆ చిన్నారులను చూస్తే మానవత్వం వున్న వారెవరైనా కంటతడి పెట్టాల్సిందే. పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ బిడ్డలు కన్నవారి ప్రేమకు దూరమయ్యారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో వారిని అమ్మమ్మ అక్కున చేర్చుకుంది. అప్పటి నుంచి ఆలనా పాలన చూసుకొనేది. కానీ విధి ఆడిన ఆటలో ఆ చిన్నారులు ఓడిపోయారు. అనారోగ్యంతో అమ్మమ్మ కూడా శనివారం తనువు చాలించడంతో ఆ బిడ్డలు అనాథలుగా మిగిలిపోయారు. ఇది చూసిన వారంతా అయ్యో.. పాపం.. ఎంత పని చేశావు దేవుడా.. అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. వివరాల్లోకెళ్తే.. అనంతపురం జిల్లా వడియం పేట గ్రామానికి చెందిన కె.రంగనాయకులు, ఆయన భార్య జ్యోతి, అతని అత్త రాజమ్మ కొండపేటలో ఓ ఇంటిని బాడుగకు తీసుకుని కూలి పనులు చేసుకుని జీవించే వారు. వీరికి రాజేశ్ (10), శ్రీకర్ (8)లు ఉన్నారు. ఇది లావుండగా రెండు సంవత్సరాల క్రితం ఆ చిన్నారుల తల్లి జ్యోతి హత్యకు గురి కాగా, 10 రోజుల కిందట తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి వారి ఆలనా పాలన అమ్మమ్మే చూసుకొనేది. కానీ తండ్రి పెద్దకర్మ జరిగిన మరుసటి దినమే కంటికి రెప్పలా చూసుకొనే అమ్మమ్మ సైతం అనారోగ్యంతో శనివారం అశువులు బాసింది. ఈమెకు గతంలో గెండెకు సంబంధించిన సమస్య వుండేది. ఇటీవల ఆపరేషన్ కోసం పుట్టపర్తి వెళ్లగా అక్కడ చికిత్స చేయించుకుంటూ చనిపోయింది. ఆమె శవాన్ని కొండపేటకు తీసుకువచ్చారు. దీంతో ఆ చిన్నారుల పరిస్థితి ఓ విషాద గాథగా మిగిలింది. కాగా ఈ కష్టం ఏ కుటుంబానికి రాకూడదని, ప్రభుత్వం వారికి ఏదో ఒక దారి చూపించి ఆదుకోవాలని గ్రామ స్థులు కోరుతున్నారు. వీరితో పాటుగా గ్రామ మాజీ సర్పంచ్ మన్నె మోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఆ కుటుంబానికి ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కాగా చిన్నారుల భవితకు దాతలెవరైనా సహకరించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా కాశిరెడ్డినాయన ఉత్సవాలు ప్రారంభం

● దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● పటిష్టమైన బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు

● భక్తుల కోసం సువిశాలమైన చలువ పందిర్లు

● విస్తృతంగా అన్నదానం



అన్నదానం కోసం వినియోగిస్తున్న కూరగాయలు

కాశినాయన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతిక్షేత్రంలో శనివారం అవధూత కాశినాయన 29వ ఆరాధనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున రుద్రాభిషేకం, గణపతి పూజలతో కాశిరెడ్డినాయన రెండురోజుల ఆరాధనోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ప్రధానార్చకులు జీరయ్యస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజక వర్గ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆరాధనను పురష్కరించుకొని జ్యోతి క్షేత్రం కాశినాయన నామస్మరణతో మార్మోగిపోయింది. కాశినాయన గర్భగుడిలోని పాలరాతి సమాధితో పాటు పరిసరాల్లోని దత్తాత్రేయ, లక్ష్మీనరసింహస్వామి, అన్నపూర్ణాదేవి, రామాలయం తదితర ఆలయాలను రకరకాల పూలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలోని కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, అనంతపురం, చిత్తూరు తదితర జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు జ్యోతి క్షేత్రానికి స్వచ్ఛందంగా తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రం జనసంద్రంగా మారింది. ఆరాధనకు వచ్చిన భక్తులు కాశినాయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం లక్ష్మీ నరసింహస్వామి, అన్నపూర్ణేశ్వరి, దత్తాత్రేయ, ఆవు సమాధిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆరాధనకు వచ్చిన భక్తులతో అన్నదాన కౌంటర్లు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చలువ పందిళ్లు, నీటివసతి కల్పించారు. స్థానికులతో పాటు యర్రగుంట్ల, అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్, తాడిపత్రి, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు వందల సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అనేక కార్యక్రమాల్లో విరివిగా సేవలందిస్తున్నారు. కాశినాయన ఆరాధనకు వచ్చిన భక్తులు తమతో పాటు అన్నదానానికి తమకు తోచిన మేర ఆర్థిక సాయంతో పాటు బియ్యం, బేడలు, కూరగాయలు, ప్లేట్లు ఇతర వస్తువులు కానుకలుగా అందిస్తున్నారు. రాత్రి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం నిర్వహించారు. డా.ప్రశాంతి ఆధ్వర్యంలో నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందజేశారు. మైదుకూరు డీఎస్పీ అధ్యక్షతన పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ హనుమంతు పర్యవేక్షణలో దాదాపు 175 మంది పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు వందల సంఖ్యలో ప్రైవేట్ వాహనాల్లో భక్తులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృతంగా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ భక్తులకు సేవలందించారు.



ప్రత్యేకంగా అలంకరించిన కాశినాయన పాలరాతి సమాధి

తీర్థయాత్రకు వెళ్లిన మహిళ

గుండెపోటుతో మృతి



ఉషారాణి (ఫైల్)

సిద్దవటం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల్లో భాగంగా గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిన సిద్దవటం గ్రామానికి వెళ్లిన మహిళ గుండెపోటుతో గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... స్థానికంగా నివసించే సూర్యనారాయణ, తన భార్య ఉషారాణి (60)తో కలిసి డిసెంబరు 5న తీర్థయాత్రలకు వెళ్లారు. 12వ తేదీ గురువారం ఉదయం గుజరాత్‌లోని సోమనాథ్‌లో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 8.30 గంటల సమయంలో గుండెపోటు రావడంతో ఉషారాణి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో సమీపంలోని ఆస్పత్రికి ఆమెను తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి ఆమె మృతదేహాన్ని సిద్దవటంలోని వారి ఇంటికి తీసుకురాగా, శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె 20 ఏళ్లగా సాయిగణేష్ డ్వాక్రా సంఘం లీడర్‌గా మంచి గుర్తింపు పొందారు

రేపు జిల్లా కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపిక కార్యక్రమం ఈ నెల 16న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక డీఎస్ఏ క్రీడా ప్రాంగణంలో జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సి.కొండయ్య తెలిపారు. ఇందులో పాల్గొనే ఔత్సాహిక క్రీడాకారుల వయస్సు 2005 జనవరి 12 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. కాగా బాలుర బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీల లోపు వుండాలన్నారు. హాజరయ్యే వారు తప్పక వారి ఒరిజినల్ ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో జరగనున్న అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందన్నారు. వివరాలకు 9866719473ను సంప్రదించాలని కోరారు.

ప్రతి బిడ్డకు తల్లి ప్రథమ గురువు

● ప్రభుత్వ విప్ మాధవి, వైస్ చాన్స్‌లర్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి బిడ్డకు తమ తల్లులే ప్రథమ గురువులని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, వైవీయూ వైస్ చాన్స్‌లర్ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. శనివారం కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల కంటే గురువు పాత్ర చాలా ప్రధానమైందని, గురువు ఆశీస్సులతో, గురువు అందించిన విజ్ఞానంతో విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుంటారని, అందుకు ప్రత్యక్ష నిదర్శనం తానేనని చెప్పారు. మహిళలకు తగిన విశ్రాంతి, రక్షణ అవసరమని మహిళలకు, మహిళాభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలు, అవకాశాలు అవసరమని ఒక మహిళ, ఎమ్మెల్యేగా మహిళల అభ్యున్నతికి, రక్షణ కోసం తనవంతు కృషిచేస్తానని తెలియజేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వ్యక్తులని కుటుంబంలో గాని, కార్యాలయంలో గాని మహిళల పాత్ర చాలా ప్రధానమైనదన్నారు. ప్రతి బిడ్డకు తన తల్లే ప్రథమ ఉపాధ్యాయురాలన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు, కళాశాలలో పనిచేసిన అధ్యాపకులు, ప్రధాన ఆచార్యులు హాజరయ్యారు. విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఓ.విజయలక్ష్మి, విశ్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, పూర్వ ప్రధానాచార్యులు సంజీవమ్మ, ప్రేమలత, రాజమ్మ, రంగారెడ్డి, డాక్టర్ బీఆర్ శైలజ, చరిత్ర అధ్యాపకులు రజియ సుల్తాన, అర్థశాస్త్ర అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివపార్వతి, మాజీ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి హాజరయ్యారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వర్ణోత్సవాలకు సంబంధించి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను రంజింపజేశాయి. హాజరైన ప్రముఖులను కళాశాల ప్రిన్సిపల్, ఆలుమ్ని అసోసియేషన్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

వివేకా పీఏ ప్రైవేట్ కేసుపై పోలీసుల విచారణ

పులివెందుల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్యకేసులో ఆయన పీఏ కృష్ణారెడ్డి వేసిన ప్రైవేటు కేసుపై పోలీసులు జనార్ధన్‌రెడ్డి, బైపురెడ్డి, లాయర్ ఓబుల్‌రెడ్డిని శనివారం డీఎస్పీ కార్యాలయంలో విచారించారు. అప్పటి సీబీఐ అధికారి రామ్‌సింగ్ బెదిరిస్తున్నారని పులివెందుల కోర్టులో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. కోర్టు కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడంతో గత ఏడాది డిసెంబరు 15నవివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ గత ప్రభుత్వంలో పోలీసులు ఈ కేసుపై సరైన విచారణ లేకుండా చార్జిషిట్ దాఖలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుపై పూర్తి విచారణ చేయాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఆదేశించడంతో మళ్లీ దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం ముగ్గురిని విచారించారు.

ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత

కడప కలెక్టరేట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం నుంచి 20వతేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రసంగాలు, ర్యాలీలు, విద్యార్థుల్లో అవగాహనకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు, వర్క్‌షాపులు, సెమినార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ, డీఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలు

● ఎలక్ట్రిక్ సైకిల్‌లో వెళ్తున్న వారిని ఢీకొన్నకారు

ప్రొద్దుటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ సైకిల్‌లో వెళుతున్న ముగ్గురు చిన్నారులను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై ఆసుపత్రిపాలైన ఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. స్థానిక గోపవరం పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో ఎలక్ట్రిక్ సైకిల్‌పై ముగ్గురు మైనర్లు రోడ్డు మీదకు వచ్చారు. రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలోకి రాగానే గిద్దలూరు నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న కారు వారిని ఢీకొంది. దీంతో కారు పక్కనే వున్న కాలువలో పడిపోయింది. కారులో వున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే చిన్నారులకు తీవ్రగాయాలవడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో రెవెన్యూ ఉద్యోగి మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కెవిన్(29) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఉద్యోగి కెవిన్ స్వగ్రామం ఆరోగ్యవ రం. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ శనివారం ఆరోగ్యవరం చేరుకుని కెవిన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అతి చిన్న వయస్సులో కెవిన్ మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కెవిన్ మృతి పట్ల తహసీల్దార్ పామిలేటి, రెవెన్యూ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మూగజీవాల నిర్బంధం !

● ఆకలి దప్పికతో మూగవేదన

● న్యాయం కోసం బాధితుల మొర

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య నెలకొన్న పంతాలు, పట్టింపుల ముందు మూగజీవాల ఆవేదన ఓడిపోయింది. మమతలు మరచి స్వార్థాలు తెచ్చిన తంటా నోరు లేని జీవాలకు మూగ వేదన మిగిల్చింది. ప్రాణం విలువ మరచిన ఓ మనిషి.. మాపై దయచూపవా అంటూ కాలే కడుపుతో కన్నీటి రోదన మానవ హృదయాలను కదిలించలేకపోయింది. మూడు రోజులపాటు తాగేందుకు నీరు లేక, తినేందుకు ఆహారం లేక బయటకు కదలలేక తమ బాధ మానవత్వాన్ని గుర్తు చేయించలేక దయనీయ స్థితిలో రాత్రింబవళ్లు ఆ మూగజీవాలు గడిపాయి. మూగజీవాలకు వచ్చిన కష్టం తీర్చమని యజమానురాలు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి తమ గోడును విన్నవించుకున్నారు. తమకు వచ్చిన కష్టం తీర్చమని అధికారుల చుట్టూ తిరిగి మూగజీవాల కడుపు నింపే మార్గం కోసం తపనపడ్డారు. ఇదేదో పట్నం సొగసుల మధ్య జరిగిన ఘటన కాదు మూగజీవాల పుట్టినిల్లు అయిన పల్లెసీమల్లో చోటుచేసుకున్న దయనీయ గాథ.

ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన మేకల చెన్నమ్మ, శ్రీనివాసులు భార్య మేకల లక్ష్మీదేవి వివరాల మేరకు.. చెన్నమ్మ భర్త గంగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి చెన్నమ్మ వరుసకు కుమారుడు అయ్యే శ్రీనివాసుల వద్ద ఉంటూ తన బాగోగులు చూసుకునేలా ఏర్పాటు చేసుకుంది. వీరికి మూడు ఎనుములు, రెండు ఆవులు, మూడు దూడలు ఉన్నాయి. చెన్నమ్మ, శ్రీనివాసులుకు అతని సోదరులు వెంకటసుబ్బయ్య, నాగార్జుల మధ్య ఆస్తి బాగపరిష్కార విషయంలోనూ, రస్తా వివాదంలోనూ మనస్పర్థలు ఉన్నాయి. దీంతో వారు శ్రీనివాసులుకు చెందిన పశువులు ఉంచే ఇంటి ముందు ఈ నెల 11వ తేదీన బండలు నాటారు. ఈ నేపథ్యంలో ఆరోజు జరిగిన ఘర్షణలో శ్రీనివాసులు తీవ్ర గాయాలపాలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బండలు నాటడంతో జీవాలు బయటకు రాలేక వాటికి నీరు, ఆహారం అందించేందుకు వీలు లేకుండా పోయిందని బాధితులు తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారు గంగయ్యను కలిసి వినతిపత్రం అందించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. దీంతో రూరల్ ఎస్ఐ రఫి శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకుని వెళ్లారని పేర్కొన్నారు. అయినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని చెన్నమ్మ, శ్రీనివాసులు భార్య లక్ష్మీదేవి వాపోయారు. చివరికి చేసేది లేక పశువులు ఉంచిన ఇంటి గోడ బండలను తొలగించి ఒక రంధ్రాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా పశువులకు నీరు, గడ్డి, ఆహారం అందిస్తున్నట్లు వివరించారు.



పశువుల రాకపోకలకు అడ్డంగా నాటిన బండలు



నిర్బంధంలో ఉన్న పశువులు

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు

● పింఛా ప్రాజెక్టు , వీరబల్లి, ఒంటిమిట్ట ఎన్నికల్లో స్వల్ప ఘర్షణ

● పలు సంఘాలు ఏకగ్రీవం

రాజంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో సాగునీటి సంఘాలు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 2 నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 83 ఆయకట్టు సంఘాలు ఉండగా 79 సంఘాలకు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఈ మొత్తం స్థానాలన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలే గెలిచారు. రెండు నియోజకవర్గాల్లో అతి పెద్ద సాగునీటి సంఘమైన సుండుపల్లె మండలం, పింఛా ప్రాజెక్టు ఎన్నికలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు వర్గాల ఆధిపత్య పోరు కారణంగా వాయిదా పడ్డాయి. కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం ఇండ్లూరు, ఓబులవారిపల్లె మండలం వైకోట, రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లె మండలంలోని వీరబల్లె ఎన్నికలు టీడీపీ, జనసేన నాయకుల్లో ఆధిపత్య పోరు కారణంగా ఏకాభిప్రాయం కుదరక వాయిదా పడ్డాయి. రాజంపేట మండలంలోని 7, సుండుపల్లె మండలంలో 4, వీరబల్లె మండలంలోని 3, నందలూరు మండలంలోని 13, ఒంటిమిట్ట మండలంలోని 4 సంఘాల ఎన్నికలు ఏకగ్రీవ మయ్యాయి. కోడూరు నియోజకవర్గంలోని కోడూరులో 9, ఓబులవారిపల్లెలో 5, చిట్వేలిలో 9, పెనగలూరులో 14, పుల్లంపేటలో 12 సాగునీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. ఇండ్లూరు ఊటకాలువకు ఎన్నిక జరగలేదు సంబేపల్లె మండలంలోని శెట్టిపల్లి పెద్దచెరువు, నాగిరెడ్డిగారిపల్లె, రేకులకుంట చెరువుల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు రామచంద్ర, వెంకటేశులు, ఇరిగేషన్ ఏఈఈ శివనాయక్ తెలిపారు. గాలివీడు మండలంలో అరవీడులోని కుషావతి ప్రాజెక్టుకు, గాలివీడు పెద్దచెరువుకు, తలముడిపి పెద్దచెరువు సంఘాలను టీడీపీ కైవశం చేసుకుంది. రామాపురం మండలంలో చిట్లూరు పెద్దచెరువు, కల్పనాయునిచెరువు, పెద్దచెరువు, హసనాపురం పెద్దచెరువు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారులు రామాంజనేయులు, రామకృష్ణుడు, జాషువా, నాగమణి తెలిపారు. .

పింఛా నీటి సంఘానికి వర్గపోరు..

సుండుపల్లె: మండలంలోని నాలుగు చెరువుల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, పింఛా ప్రాజెక్టు ఎన్నికల్లో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గీయులు, మరోవైపు జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గీయులు తమ వర్గం వారినే అధ్యక్షులుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేయడంతో అధికారులు చేతులెత్తేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సబ్‌కలెక్టర్ వైఖోం నిదియా దేవి అక్కడికి చేరుకుని ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రూరల్ సీఐ వరప్రసాద్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీపీ రాజమ్మ, టీడీపీ మండల అధ్యక్షులు రెడ్డెప్ప, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. రామాపురం మండలంల చాకిబండ పెద్దచెరువు, కేశాపురం, రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల పెద్దచెరువు, మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ అబ్బవరం కంచాలమ్మ గండిచెరువు, యండపల్లి గ్రామంలోని కొత్తచెరువు సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు టీసీ సభ్యులతో సహా ఏకగ్రీవమయ్యాయి.



పింఛా ప్రాజెక్టు ఎన్నికల సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోం నిదియాదేవి

వీరబల్లిలో ఉద్రిక్తత..

వీరబల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ పత్రాలకు జత చేసిన ధ్రువీకరణ పత్రాలు సరిగా లేవంటూ ఇరుపార్టీలకు చెందిన 12 దరఖాస్తులను అధికారులు రద్దు చేశారు. దీంతో నిబంధనల ప్రకారం ఎన్నికలు జరపాలని వైసీపీ వర్గం వారు పట్టుబట్టారు. అంతలో అక్కడికి టీడీపీ చేరుకున్న టీడీపీ వర్గాలు గతంలో ఎన్నిక లేకుండానే రాసుకున్నారని, నామినేషన్ పత్రాలతోపాటు ఏం జతపరచాలో తెలియదా అని వ్యాఖ్యానించడంతో వాగ్వివాదం చేసుకుసుకుంది. రూరల్ సీఐ వరప్రసాద్ ఇరువర్గాలను శాంతింపజేశారు. అనం తరం ఎంపీడీవో నూర్జహాన్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన 12 నామినేషన్ పత్రాల్లో నోడ్యూ సర్టిఫికెట్, పన్నుల సర్టిఫికెట్ జతపరచక పోవడంతో తిరస్కరించినట్లు తెలియజేశారు. అదే విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని వైసీపీ వర్గం పట్టుబట్టడంతో ఎంపీడీవో ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించే తేదీని ఉన్నతాధికారులు ప్రకటిస్తారని ఎంపీడీవో వారికి తెలియజేశారు. మండలంలో మూడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ప్రకటించగా వీరబల్లి వాయిదాపడింది. గంగనేరు, దేవదాసి చెరువుల సంఘాలను రెండు టీడీపీ వర్గం కైవసం చేసుకుంది. గంగనేరు సాగునీటి సంఘ చైర్మన్‌గా తిరుపతి ఆదిలక్షుమమ్మ, వైస్ చైర్మన్‌గా అనగాని నాగభూషణం, దేవదాసిచెరువు చైర్మన్‌గా కొండూరు మహేశ్వర్‌రాజు, వైస్ చైర్మన్‌గా ముద్దలూరి వాసుదేవ రాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్‌వోలు వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఇండ్లూరులో నామినేషన్ వేసేవారే లేరు..

పెనగలూరు: మండలంలో 14 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, ఇండ్లూరు ఊటకాలువకు మాత్రం ఎన్నిక జరగలేదు. ఈ సంఘంలో 190 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో ఈ ఎన్నిక ఆగిపోయిందని ఎన్నికల అధికారి, ఉపాధి హామీ ఏపీవో మురళి తెలిపారు. ఈ సాగునీటి సంఘంలో 134 మంది పురుషులు, 56 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉదయం 10.30 గంటలకు డిప్యూటీ కలెక్టర్, ఆర్వో రమామణి



ఒంటిమిట్ట: ఘర్షణ పడుతున్న టీడీపీ వైసీపీ నాయకులు



ఇండ్లూరు పోలింగ్ కేంద్రంలో ఖాళీగా కూర్చున్న ఎన్నికల సిబ్బంది

ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించి పరిస్థితిని తెలుసుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల లోపు ఎవరైనా నామినేషన్ వేస్తే తీసుకోవాలని ఎన్నికల అధికారి తెలిపినట్లు తెలి పారు. ఈ విషయంపై విలేకరులు ఎన్నికల అధికారిని వివరణ కోరగా 11 గంటల ప్రాంతంలో నామినేషన్ వేయడానికి ముగ్గురు వ్యక్తులు వచ్చారని, ప్రపోజల్స్ తెచ్చు కోవాలని తెలిపామని అన్నారు. ప్రపోజల్స్ తెచ్చుకుంటామని వెళ్లినవారు ఇంత వరకు ఒక్కరు కూడా రాలేదని ఈ సందర్భంగా తెలిపారు. ఇదిలా ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహి స్తామని ఆ తర్వాత జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

టీడీపీ, వైసీపీ మద్దతుదారుల ఘర్షణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. 5వ టీసీ పరిధిలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో గందరగోళం నెలకొంది. స్థానిక సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఓ సమయంలో ఘర్షణ చోటు చేసుకునే అవకాశం ఉండడంతో పోలీసులు చెదరగొట్టారు.

వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదు

ఒంటిమిట్ట చెరువు ఎన్నికల్లో పోలింగ్ అధికారి ప్రభాకర్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని టీడీపీ నేతలు తహసీల్దారు రమణమ్మ, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఇరిగేషన్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 9.15 నుంచి 9.45 గంటల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 10.15 నుంచి 11.30 గంటల వరకు ఓటర్లను అనుమతించారని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ వృథా కాకుండా కాపాడుకుందాం

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చాలా విలువైనదని, దానిని వృథా కాకుండా కాపాడుకుందామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వనరులను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా ప్రజలందరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని, విద్యుత్‌శాఖ వారు సూచించే చిట్కాలు పాటించి విద్యుత్ ఆదా చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్పీడీసీఎల్ ఈఈ యుగంధర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల్లో విద్యుత్ ఆదా యొక్క అవసరాన్ని, వనరుల పరిరక్షణ గురించి అవగాహన పెంపొందించేందుకు విద్యుత్ పరిరక్షణ వారోత్సవాలను చేపడుతున్నట్లుగా తెలిపారు. ప్రతి ఇంటిలో లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ కుక్కర్, ఏసీ, ఫ్రిజ్, గీజర్ వంటి విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించేటప్పుడు చిట్కాలను పాటించి విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు, బిల్లులను తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో డీఈవో ఆకస్మిక తనిఖీ

చిన్నమండెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంఘిక , గణిత శాస్త్రం తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం తరగతులు నిర్వహించి 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.



ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

'సకాలంలో సాగునీరు అందించండి'

సుండుపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు దిగువ భాగంలో ఉండే రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి తెలిపారు. శనివారం పింఛా ప్రాజెక్టును ఆమె పరిశీలించారు. నీరు వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని రైతులు సూచించారు. గతంలో వచ్చిన తుఫాను కారణంగా కొట్టుకుపోయిన పార్కును అభివృద్ధి చేయాలని, గెస్ట్ హౌస్ నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం



లక్కిరెడ్డిపల్లెలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి ఫైజున్నీసా

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో కోర్టు కేసులు, పోలీసు స్టేషన్లకు వెళ్లి ఇబ్బందులు పడకుండా రాజీమార్గమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జి ఫైజున్నీసా తెలిపారు. శనివారం స్థానిక సివిల్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ కేసులు, మొండి బకాయిలు, సీసీ, ఐపీసీ, ఇతర కేసులకు సంబంధించిన 7,64,840 రూపాయలు వసూలైనట్లు కోర్టు వర్గాలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామాల్లో పొలాలు గట్ల దారులు, చిన్న చిన్న గొడవలతో క్షణికావేశంలో కేసులు పెట్టుకొని పోలీస్ స్టేషనుకు వెళ్లడం మంచిది కాదన్నారు. రాజీ మార్గంలో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, చెన్నకృష్ణయ్య, బాలాజీరెడ్డి, రెడ్డెన్న, సిద్దయ్య, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధవటం: సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించిన పలు కేసులపై శనివారం బద్వేలు న్యాయం స్థానంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు మండలాలకు చెందిన పలు రకాల కేసులను సిద్దవటం ఇన్‌చార్జి సివిల్ జడ్జి విజయలక్ష్మి పరిష్కరించారు. ఈ సందర్భంగా 100 కేసులు పరిష్కారమైనట్లు సిద్దవటం కోర్టు సిబ్బంది తెలియజేశారు.

లేబాకను నారా లోకేష్ దత్తత తీసుకోవాలి

నందలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లేబాక గ్రామ పంచాయతీని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకులు ఆవుల బాలసుబ్రమణ్యం, లేబాక సర్పంచ్ లంకయ్యు గారి నరసయ్య విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నారా చంద్రబాబు నాయుడు పేరుతో నిర్మించామని, ఇక్కడి ప్రజలు టీడీపీని అభిమానిస్తారని తెలిపారు. నేడు జరిగిన నీటి సంఘం ఎన్నికలు కూడా ఏకగ్రీవమ య్యాయ న్నారు. గ్రామ పంచాయతీలో అన్నిరకాల సదుపా యాలను కల్పించి, అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడవ కూటి సంజీవ రాయుడు, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవుల బాలసుబ్రమణ్యం

జర్నలిస్టులపై దాడులు నశించాలి: ఏపీయూడబ్ల్యూజే

రాజంపేట టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య అని నియోజకవర్గ ఏపీ డబ్ల్యూజే అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాజంపేట ప్రెస్ అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. శనివారం జర్నలిస్టులపై జరిగిన దాడులను నిరసిస్తూ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేముల మండల కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజికి వెళ్లిన జర్నలిస్టులపై దాడిచేయడం దుర్మార్గమని, దాడికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ సీఐ ఎల్లమరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాజం పేట కమిటీ సభ్యులు అప్పారావు, సుబ్బనరసింహులు, విక్రమ్, గణేష్, రవి చంద్రప్రసాద్, రామ్మోహన్, కళ్యాణ్‌రాయల్, మందా శివయ్య, ఓబులేశు, ఆలీ షేక్, సునీల్, శ్రీహరి, వెంకటసుబ్బయ్య, దుర్గయ్య, దివాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఐకి ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

అన్నమయ్య జిల్లా బీసీ సమన్వయ కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం హక్కుల సాధన లక్ష్యంగా బీసీ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ పూర్ణచంద్రరావు, కన్వీనర్ బీసీ రమణ, అధికార ప్రతినిధి సీ. రాములు తెలిపారు. రాయచోటి పట్టణంలో శనివారం నిర్వహించిన బీసీ సమన్వయ కమిటీ ఎన్నిక సందర్భంగా వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ కుల జనగణనే లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం అన్నమయ్య జిల్లా బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ, జిల్లా కన్వీనర్‌గా ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా వల్లెపు రమణమ్మ, జిల్లా కోకన్వీనర్లుగా పవన్‌కుమార్, సుధాకర్, రంజిత్‌కుమార్, ఖాదర్ బాషా, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధిగా రామును ఎన్నుకున్నట్లు తెలిజేశారు.

జిల్లాకు నేడు మంత్రి మండిపల్లి రాక

రాయచోటిటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం రాయచోటికి రానున్నారు. ఉదయం 6.30 గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయానికి చేరు కుంటారు. అనంతరం మంత్రి ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నారా లోకేష్‌తో కావుటూరి భేటీ

రాజంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రదాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌తో శనివారం రాజంపేట టీడీపీ నాయకుడు కావుటూరి ఆదినారాయణ భేటీ అయ్యారు. పలు విషయాలు చర్చించారు. రాజంపేట ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని విన్నవించారు.

దిన్నెపాడు పెద్ద చెరువు, చిన్నపోతుల ప్రాజెక్టు సంఘాల ఎన్నిక ఏకగ్రీవం



దిన్నెపాడు పెద్దచెరువు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డికి డిక్లరేషన్ అందజేస్తున్న అధికారులు



ఊటుకూరు చెరువు అధ్యక్షుడు నామా హరినాథ్‌ను, సభ్యులను సత్కరిస్తున్న టీడీపీ నేతలు



నారాయణనెల్లూరు సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కేతా చంద్రశేఖర్, సుబ్బనరసయ్య

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి); మండలంలోని దిన్నెపాడు పెద్దచెరువు, పాళెంగొల్లపల్లె చిన్నపోతుల ప్రాజెక్టుల సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దిన్నెపాడు పెద్దచెరువుకు చైర్మన్‌గా మార్ల రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా దర్బార్, చిన్నపోతుల ప్రాజెక్టు చైర్మన్‌గా శివగోపాల్, వైస్ చైర్మన్‌గా రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు.మంత్రి సోదరుడు మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి సమక్షంలో పోలింగ్ ఆఫీసర్లు విజేతలకు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో రెడ్డెయ్య, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు శ్రీరాములు, పుష్పరాజు, కృష్ణయ్య, ఇరిగేషన్ ఏఈ మహబూబ్‌బాషా, మండల యువనాయకుడు యనమల మదన్‌మోహన్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి శంకారపు జయరాం, కావలి ఆంజనేయులు, ఓబులేసు,. దర్మరాజు. సంజీవరాజు, కోనంపేట లక్ష్మీనారాయణ, గంగిరెడ్డి, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరు చెరువు అధ్యక్షుడుగా నామా హరినాథ్

రాజంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) మండలంలో 7 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఊటుకూరు చెరువు ఆయకట్టు సంఘానికి నామా హరినాద్. ఉపాధ్యక్షులుగా మలిశెట్టి చెంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోలి చెరువుకు నాగినేని నాగేశ్వర్‌నాయుడు, ఉపాధ్యక్షుడుగా పసుపులేటి పెంచలయ్య ఎన్నికయ్యారు. తాళ్లపాక చెరువుకు అధ్యక్షుడుగా జవ్వాజి అదృష్టదీపుడు, ఉపాధ్యక్షుడుగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. హస్తవరం చెరువు అధ్యక్షుడుగా ఆవుల యానాదయ్య, ఉపాధ్యక్షురాలుగా కొండూరు రుక్మిణి ఎన్నికయ్యారు. మన్నూరు చెరువు అధ్యక్షుడుగా నారదాసు రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడుగా కృష్ణంరాజు, గుండ్లూరు సంఘ అధ్య క్షుడుగా ముమ్మడి స్వప్న, ఉపాధ్యక్షురాలుగా అరవ రాములమ్మ ఎన్నికయ్యారు. మందపల్లె కాలువ అధ్యక్షుడుగా అల్లం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడుగా అద్దెపల్లె పురుషోత్తంరాజు ఎన్నికయ్యారు.

వైకోట - గుండాలకోన రోడ్డు పనులు ప్రారంభించాలి

ఓబులవారిపల్లె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆధిపత్యపోరు కారణంగా మండలంలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య అన్నారు. శనివారం ఆయన రైతులతో కలసి గుండాల కోనకు వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తవుతున్నా టీడీపీ, జనసేన పార్టీల నాయకుల్లో ఆధిపత్య పోరు కారణంగా వైకోట - గుండాలకోన రోడ్డు పనులు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలన్నారు. డిసెంబరు 20వ తేదీ లోపు రోడ్డు పనులు ప్రారంభించకుంటే రైతులందరిని కలుపుకుని ఈనెల 21న సచివాలయం దగ్గర ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ కార్మికుల సంఘం నాయకుడు కొమ్ముద్దుల వెంకటరమణ, గ్రామస్తులు కడియాల చిన్నయ్య, మేకల మురళి, బిగాల సుధ, నాగభూషణం, కొంకల చంద్ర, కడియాల జయరాం, బాబు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



గుండాలకోనకు వెళ్లే మార్గంలో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘనాయకులు

తిరుమలకు మహాపాదయాత్ర ప్రారంభం

రాజంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం హస్తవరం చెరోపల్లె నుంచి శనివారం దేవరకొండ భానుమూర్తిశర్మ ఆధ్వర్యంలో అన్నమయ్య కాలి బాట తిరుమల మహాపాద యాత్ర ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమూర్తిశర్మ మాట్లాడు తూ తాను 32 సంవత్సరాలుగా అన్నమయ్య కాలిబాట ద్వారా తిరుమలకు పాదయాత్ర చేస్తున్నానని, ఈ ప్రాంత ప్రజల బాగు కోసం, వెంకటేశ్వరస్వామి ఆశీస్సుల కోసం ఈ పాద యాత్ర చేస్తున్నానని తెలిపారు. పాదయాత్రలో వేలాదిమంది పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు.



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భానుమూర్తిశర్మ, తదితరులు

మాధవరంలో అధ్వానంగా పారిశుధ్యం

సిద్దవటం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో అంటురోగాలు వ్యాపిస్తాయని ప్రజలుఆందోళన చెందుతున్నారు. స్థానిక భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణం కొద్ది నెలలుగా చెత్త తొలగించకపోవడంతో వర్షపునీరు నిలిచి దుర్వాసన వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారుల నిర్లక్ష్యధోరణి వీడి తక్షణమే చెత్తకుప్పలను తొలగించి పారిశుధ్యాన్ని పరిరక్షించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కంటిచూపు పోతోంది

- చిన్నపిల్లల్లో మయోపియా వ్యాధి
- 1-15 ఏళ్ల పిల్లల్లో 50 శాతం మందికి
- ఇందుకు తల్లిదండ్రులూ కారణమే

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో చిన్నపిల్లలకు కంటి చూపు తగ్గిపోతోంది. ఏడాది నుంచి 15 సంవత్సరాల చిన్నపిల్లలకు, తల్లిదండ్రులు మొబైల్ అలవాటు చేయడం వల్ల వారికి కంటిచూపు మందగించి మయోపియా అనే జబ్బు భారిన పడి జీవితాంతం కంటి అద్దాలు వాడే పరిస్థితికి కొనితెచ్చుకుంటున్నారు. సెల్‌ఫోన్, టీవీలు గంటల తరబడి చూడడం వల్ల ఈ జబ్బు వస్తుందని నిపుణులు ఓ పరిశోధనలో వెల్లడించారు. ఒక్కసారి ఈ వ్యాధి వచ్చిన పిల్లలకు జీవితాంతం చూపు మందగిస్తూనే ఉంటుందని, వారు కంటి అద్దాలు వాడక తప్పదని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా చిన్నపిల్లలకు కంటి చూపు తక్కువ మోతాదులో ఉంటుంది. చిన్నపిల్లలకు గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పోషక పదార్థాలు పెట్టి కంటి చూపు పెంచుకోవడానికి ప్రయత్నం చేయకుండా తల్లిదండ్రులు సెల్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల ఉన్న కంటి చూపుపోయి వారికి కంటి అద్దాలు తెచ్చుకునే పరిస్థితులు దాపురిస్తున్నాయని డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి కంటి అద్దాలు వాడే పిల్లలకు 40 సంవత్సరాల తర్వాత ఎటువంటి చూపు ఉండకపోవచ్చని ఒక పరిశోధనలో వెల్లడైనట్లు తెలిసింది. జన్యుశాస్త్రం ప్రకారం తల్లిదండ్రుల్లో ఒకరికి సైట్ వస్తే వారి పిల్లలకు అది మూడు రెట్లు ప్రభావం చూపుతుందని డాక్టర్లు ఒక అంచనాకు వచ్చారు.

కంటి చూపు మందగించడానికి కారణాలు

చిన్నపిల్లలు బయట గ్రౌండ్‌లో ఆడుకోకపోవడం, స్కూల్ నుంచి ఇంటికి రాగానే సెల్‌ఫోన్ పట్టుకుని గంటల తరబడి చూడడం వల్ల ఈ మయోపియా వ్యాధి వస్తుందని డాక్టర్లు పరిశోధనలో వెల్లడించారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర పూర్తిగా ఉన్నట్లు కూడా వారు అంచనాకు వచ్చారు. తల్లిదండ్రుల్లో ఒకరికి సైట్ వస్తే ఖచ్చితంగా వారి పిల్లల్లో ఒకరికి సైట్ వస్తుంది. సెల్‌ఫోన్‌లో వీడియోగేమ్, క్రికెట్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు అని రకరకాల దృశ్యాలను చూడడం వల్ల చిన్న పిల్లలు కంటి చూపు కోల్పోతారని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగాల బిజీలో పడి పిల్లలకు సెల్‌ఫోన్లు అలవాటు చేయడం వల్ల ఐదేళ్ల లోపు పిల్లలు ఈ వ్యాధి భారిన పడి నరకం అనుభవిస్తున్నారని కంటి వైద్యనిపుణులు చెబుతున్నారు. చిన్నపిల్లలు కనీసం ఎండలో రెండు గంటల పాటు ఆడుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. సాధారణ ప్రకృతి సూర్యరశ్మి వల్ల కంటి చూపు సమస్యలు రావని, ఒక వేళ వచ్చినా ఎక్కువ శాతం ప్రభావితం చూపవని వైద్యులు నిర్ధారించారు.


రాజంపేటలో పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభంజన్‌కుమార్ (ఫైల్)

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం చిన్న పిల్లల్లో కంటి వ్యాధులు ఎక్కువగా ఉన్న పరిస్థితులు మనం చూస్తున్నాం. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను కంటి డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించాలి. పిల్లలను గారాబం చేసి సెల్‌ఫోన్‌లకు, టీవీలకు అలవాటు చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు సెల్‌ఫోన్‌లకు అడిక్ట్ అయిపోతే అనంతరం తల్లిదండ్రులు బాధపడాల్సి వస్తుంది. ముందుగానే వాటిని చిన్నారులకు దూరంగా ఉంచేలా చూసుకోవాలి.

-డాక్టర్ కొండయ్య, డీఎంహెచ్‌వో, అన్నమయ్య జిల్లా

ఫోన్‌లు పిల్లలకు దూరంగా ఉంచాలి



చిన్నపిల్లలకు స్మార్ట్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల వారు దగ్గర దృష్టి, దూర దృష్టి రెండు కోల్పోతారు. చిన్నపిల్లలకు పాలు, గుడ్లు, ఆకుకూరలు పండ్లతో పాటు మంచి విటమిన్స్ లభించే ఆహార పదార్థాలు ఇవ్వాలి. పానీపూరి, గోబి మంజూరియా, చాక్లెట్, బిస్కెట్స్, పిజ్జా అలవాటు చేయకూడదు. వారానికి రెండుసార్లు అయినా బయట ఎండలో ఆడుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలి. అప్పుడే కంటికి సంబంధించిన వ్యాధులు రాకుండా నివారించవచ్చు.

- శ్రీనివాస్, రాయచోటి ఆర్డీవో

పిల్లలకు స్మార్ట్‌ఫోన్ అలవాటు చేయొద్దు



ఏడాది నుంచి 15 సంవత్సరాల వయస్సు గలవారికి స్మార్ట్‌ఫోన్ అలవాటు చేసి తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారు. కనీసం వారానికి మూడుసార్లైనా పిల్లలు బయట ఎండలో ఆడుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలి. పిల్లలను గారాభం చేసి సెల్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల వారికి కంటి చూపు మందగించి రాబోవు రోజుల్లో వారు అంధహీనులుగా మిగిలిపోతారు. ఈ విషయాన్ని ప్రతి తల్లి తండ్రి ఆలోచించి ముందు జాగ్రత్తగా పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడం మానుకోవాలి.

- ప్రభంజన్‌కుమార్,
కంటి వైద్యనిపుణుడు, స్విమ్స్ తిరుపతి

జాతీయ మెగా లోక్‌అదాలత్ విజయవంతం



రాయచోటిలో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా అయిదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, ఇతర జడ్జిలు - లోక్‌అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జడ్జిలు

రాయచోటి టౌన్, డిసెంబరు 14 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఐదవ జిల్లా అదనపు జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 130 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు పరిధిలోని వివిధ మండలాల్లో జరిగిన యాక్సిడెంట్, చెక్‌బౌన్స్, సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన 130 కేసులను జిల్లా అయిదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానాలు పూర్తిస్థాయిలో విచారించి ఇరువర్గాలతో మాట్లాడి రాజీమార్గం ద్వారా 130 కేసులను పరిష్కరించి రూ.కోటి 84 లక్షల 53 వే 539 రూపాయలు జరిమానా విధించడంతో పాటు చెల్లింపులు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ వారు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.7.44 కోట్ల పరిహారం

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోర్టులో శనివారం రాత్రి వరకు నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 313 కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టు భవన సముదాయాల్లో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష్, రెండవ అదనపు మేజిస్ట్రేట్ కీర్తన, స్పెషల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చలపతి ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 44 సివిల్ కేసులు, 269 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా వీటిలో బాధితులకు రూ.7,44,33,578 పరిహారం చెల్లించారు.

కేసుల సత్వర పరిష్కారం

వాల్మీకిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు సత్వర పరిష్కార వేదిక జాతీయ లోక్‌అదాలత్ అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ గురు అరవింద్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంతో కక్షలకు పోయి కేసులతో జీవితాలను దుర్భరం చేసుకోకుండా ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి నిత్యం కోర్టులలో సింగిల్‌సిట్టింగ్ నిర్వహించడం జరుగుతుందని కక్షిదారులు దానిని సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, తదితర మొత్తం 144 కేసులు, నగదు రికవరీలు రూ.57,72,880 పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు రాంప్రసాద్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ లో 115 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ఇన్‌చార్జ్ న్యాయమూర్తి విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన మెగా లోక్‌అదాలత్ జరిగింది. సీసీ(ఐపీసీ) సంబంధించిన కేసులు 20, సీసీ (అడ్మిషన్) కేసులు 6, ఎస్‌పీసీ (అడ్మిషన్) కేసులు 62, సీసీ ఎక్సైజ్ కేసులు 20, ఓయస్ పార్టిషన్ 4, ఓయస్ (పీఐ) రెండు కేసులు పరిష్కరించి రూ.3,59,545 ఫైన్ వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రామచంద్ర, పోలీసులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

బతుకు భారమై..

ఆటో నడుపుతూ..

- ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ
- రుణం ఇప్పించాలని వేడుకుంటున్న గిరిజన మహిళ


తన పిల్లలతో కలిసి ఆటోలో గంగమ్మ

కొండాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా అవి అందరికీ చేరడం లేదు. భర్త అనారోగ్యంతో ఉండటంతో కుటుంబ పోషణ భారమై ఆటో నడుపుతూ తోబుట్టువులు, తన తల్లిదండ్రులను పోషిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది గిరిజన మహిళ పగడాల గంగమ్మ.


పూరి గుడిసెలో నివాసం ఉంటున్న గంగమ్మ

ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తూ...

కొండాపురం మండలంలోని గండ్లూరు ఎస్టీ కాలనీలో గంగమ్మ కుటుంబం ఒక పూరి గుడిసెలో ఉంటోంది. గంగమ్మకు భర్త రవితో పాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. నలుగురు చెల్లెల్లు. ఒక తమ్ముడు ఉన్నాడు. తల్లిదండ్రులు అరుణ, గంగన్న ఉన్నారు. వీరంతా గంగమ్మతోనే ఉంటూ జీవనం గడుపుతున్నారు. భర్త రవికి తల్లిదండ్రులు లేకపోవడంతో గంగమ్మతో పాటు ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. గంగమ్మతో పాటు తండ్రి గంగన్న మాత్రమే కుటుంబాన్ని పోషిస్తున్నారు. భర్తకు అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు.

గంగమ్మ అమ్మ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటోంది. తన తోబుట్టువులు నలుగురు చిన్నపిల్లలు. వీరిని బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తోంది గంగమ్మ. తన పిల్లలు పసిపిల్లలు. దీంతో కుటుంబపోషణ భారం కావడంతో కూలీ పనులకు వెళ్లకుండా, తన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి ఆటో నేర్చుకుంది. బతుకుబండి నడిపేందుకు తన బంధువుల వద్దనున్న పాత ఆటోను అద్దెకు తెచ్చుకుంది. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆటోలో కూలీలను పనులకు తీసుకెళుతూ, బడిపిల్లలను తన ఆటోలో తీసుకెళుతూ జీవనం సాగిస్తోంది. ఆటో నడుపుతూ రోజూ రూ.300 వరకు సంపాదిస్తూ నేటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. సంపాదన తక్కువ కావడంతో ప్రభుత్వం ఉపాధి కోసం తగిన ఆర్థిక సహాయం అందించాలని గంగమ్మ వేడుకొంటోంది.

కాళ్లరిగేలా తిరిగినా రుణం లేదు..

గంగమ్మ ఇల్లు గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురయింది. దీంతో ఇల్లు కోల్పోయి పూరిగుడిసెలో నివాసం ఉంటోంది. పాత ఆటో బాడుగకు తీసుకొని నడుపుతోంది. ఆటో కోసం బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా తనకు బ్యాంకులు రుణం ఇవ్వలేదని గంగమ్మ కన్నీటి పర్యంతమవుతోంది. అంతేగాక గండికోట నిర్వాసితుల జాబితాలో తన పేరు చేర్చకపోవడంతో పరిహారం రాక పూరి గుడిసెలోనే నివాసం ఉన్నామంటూ చెబుతోంది గంగమ్మ.

ప్రభుత్వం సహాయం అందించాలి..

గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా తనకు సహాయం అందలేదు. ఆటో కొనుక్కోవడానికి ఒక గిరిజన మహిళగా తనకు ప్రభుత్వ సహాయం అందించాలని వేడుకుంటోంది. పూరి గుడిసెలో ఉన్న తమకు ఇళ్లు, ఇళ్ల స్థలం ఇవ్వాలి. అదే విధంగా గండికోట ప్రాజెక్టు కింద పరిహారం ఇవ్వాలని గంగమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

సీటీఎం మిల్లు కార్మికులకు వేతనం మంజూరు

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీటీఎం మిల్లులో పనిచేసిన కార్మికులకు 23 నెలల వేతనం మంజూరైనట్లు ఎంఎస్‌ఎం వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు వై.రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిల్లు లాకౌట్ సమయంలో 311 మంది కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను కార్మికశాఖ కమిషనర్ మంజూరు చేశారని రాజారెడ్డి తెలిపారు.

మంచు మృత్యువు

- శీతాకాలం...వాహనదారులకు పరీక్షా సమయం
- అవగాహన, అప్రమత్తతతో సురక్షిత ప్రయాణం

పీలేరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి ఏడాదిలో డిసెంబరు, జనవరి మాసాల్లో పొగ మంచు అధికంగా ఉంటుంది. వరుస తుఫాన్‌ల కారణంగా ఈ ఏడాది మరింత ఎక్కువగా పొగమంచు కురుస్తోంది. పొగమంచు కారణంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. పొగమంచు ఉన్నప్పుడు రోడ్లపై డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరం. అందుకే చలికాలంలో డ్రైవింగ్ చేయడం అంత తేలికైన పనికాదు. పొగమంచు కారణంగా రోడ్లపై ఏమీ త్వరగా కనిపించదు. దీని కారణంగా ప్రమాదం మరింత ఎక్కువ అవుతుంది.

మీరు పొగమంచులో డ్రైవ్ చేయబోతున్నట్లైతే కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. శీతాకాలంలో డ్రైవింగ్ చేసేటప్పుడు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు, మెలకువలు పాటించాలని, లేకపోతే ప్రమాదాల బారినపడే ప్రమాదం పొంచి ఉంటుందని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు. పీలేరు ఎంవీఐ విజయకుమారి శీతాకాలంలో వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలను కొన్ని వివరించారు.


రాత్రి ప్రయాణం అస్సలే వద్దు....

చీకటి పడిన తరువాత నుంచి ఉదయం 7 గంటల వరకు దూర ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ఆ సమయంలో విశ్రాంతి తీసుకుని బాగా ఎండ వచ్చాక ప్రయాణం ప్రారంభించడం ఉత్తమం.


పీలేరు-తిరుపతి మార్గంలో పొగమంచులో వాహనాలు

నెమ్మదిగా డ్రైవ్ చేయాలి...

పొగమంచులో వాహనాలను వేగంగా నడపరాదు, నెమ్మదిగా నడపాలి. పొగమంచు కారణంగా రహదారిపై ముందు వెళ్లే వాహనాలు స్పష్టంగా కనిపించవు. కాబట్టి అధిక వేగం వల్ల ప్రమాద తీవ్రత పెరుగుతుంది.


పీలేరు-కడప మార్గంలో...

ముందు వెళ్లే వాహనాలకు మన వాహనానికి దాదాపు 100 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. మంచు పూర్తిగా తగ్గిన తరువాత సాధారణంగా వేగం పట్టుకుంటే గమ్యానికి సురక్షితంగా చేరుకోవచ్చు.

ఓవర్‌టేక్ చేయరాదు

దట్టమైన పొగమంచులో డ్రైవింగ్ చేసేటప్పుడు ఓవర్‌టేక్ చేయరాదు. పొగమంచులో దూరాన్ని నిర్ధారించడం కష్టం కాబట్టి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. ముందున్న ఇతర వాహనాల డ్రైవర్లు పరధ్యానంలో ఉంటే ఢీకొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఫాగ్ లైట్లు ఉపయోగించాలి

పొగమంచు సమయంలో హై బీమ్ లైట్లను ఉపయోగించరాదు. ఎందుకంటే అవి పొగమంచులో ప్రకాశాన్ని పెంచుతాయి. దీని కారణంగా రహదారి అస్పష్టంగా కనిపిస్తుంది. లోబీమ్ ఉండే ఫాగ్ లైట్లను ఉపయోగించాలి. ఎందుకంటే అవి పొగమంచులో చొచ్చుకుపోవడానికి, రహదారిపై ముందుకు వెళ్లడానికి సహాయపడతాయి.


అకస్మాత్తుగా బ్రేక్ వేయొద్దు

పొగమంచులో సడన్ బ్రేక్‌లు వేయడం వల్ల కారు స్కిడ్ అయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది. అందువల్ల నెమ్మదిగా డ్రైవ్ చేయాలి. ఇండికేటర్‌లను సరిగ్గా ఉపయోగించాలి. తద్వారా వెనుక వచ్చే వాహనాల డ్రైవర్లు కారు ఎటువైపు తిరుగుతుందో అర్థం చేసుకోగలరు.

డీఫాగర్‌ను ఉపయోగించండి

పొగమంచు వల్ల మీ వాహనం విండ్‌షీల్డ్‌పై నీరు పేరుకుపోతుంది. ఇది ముందువైపు వ్యూను మరింత తగ్గిస్తుంది. కాబట్టి డీఫాగర్‌ను ఆన్ చేయాలి. ఇది కాకుండా మీరు విండ్‌షీల్డ్ వైపర్‌లను కూడా ఉపయోగించవచ్చు.

జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవు



చలి కాలంలో వాహనాలు, డ్రైవర్లకు పొగమంచు ప్రధాన శత్రువు. మంచు కారణంగా రోడ్డు స్పష్టంగా కనిపించదు. సాధారణంగా నడిపినట్లు మంచు వాతావరణంలో కూడా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయి. అనుభవజ్ఞులు, సుశిక్షితులైన డ్రైవర్లకు ప్రతికూల వాతావరణంలో వాహనాలు నడిపిన అనుభవం ఉంటుంది కాబట్టి వారు జాగ్రత్త పడగలరు. స్వంతంగా వాహనాలు నడిపేవారు, కొత్తగా వాహనాలు తీసుకున్న వారు, ఉదయం పూట ప్రయాణాలు పెట్టుకున్న వారు కచ్చితంగా జాగ్రత్తలు తెలుసుకోవాల్సిందే. ప్రయాణాలకు ముందురోజు తాము ప్రయాణం చేయాల్సిన మార్గం, అందులోని వాతావరణం, ఆ వాతావరణంలో పాటించాల్సిన జాగ్రత్తలను విధిగా తెలుసుకుంటే సురక్షితంగా గమ్యం చేరవచ్చు.

-విజయ కుమారి, ఎంవీఐ, పీలేరు

సురక్షితమైన డ్రైవింగ్ కోసం విండ్‌షీల్డ్‌ను శుభ్రంగా ఉంచడం చాలా ముఖ్యం.

హజార్డ్ లైట్లను ఉపయోగించాలి

అన్ని వాహనాలకు పార్కింగ్ లైట్ల కోసం ప్రత్యేక బటన్ ఉంటుంది. ఆ బటన్‌ను నొక్కడం ద్వారా వాహనం నాలుగు వైపులా సూచికలు ఏకకాలంలో వెలిగించడం మంచిది. వీటిని హజార్డు లైట్లు అని కూడా అంటారు. ఈ లైట్లను ఉపయోగించడం ద్వారా దూరం నుంచి, వెనుక, ముందు వచ్చే వాహనాలను చూడవచ్చు.

రాజీ మార్గమే రాజమార్గం

● లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

● జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

కడప రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు తమ సమస్యలను లోక్ ఆదాలత్‌లో రాజీమార్గంతో పరిష్కరించుకుని తద్వారా సత్వర న్యాయం పొందడంతో పాటు డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. ఇక్కడ ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అపీల్‌కు వెల్లడానికి వీలు పడదన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇప్పటికే కోర్టులలో దాఖలై విచారణకు వేచి ఉన్నవే కాక కోర్టులో దాఖలు కాని సమస్యలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కోర్టుల జడ్జిలు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,553 కేసులకు అవార్డులు

ఉమ్మడి జిల్లాలోని వివిధ కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 6,553 కేసులకు అవార్డులు ఇచ్చినట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఇందుకు రూ.6,72,21,635 చెల్లింపులు జరిగాయన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్ చొప్పున ఏర్పాటు చేసి లోక్ అదాలత్‌కు వచ్చిన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించామన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అవార్డు పొందిన యాక్సిడెంట్ కేసుకు సంబంధించి బాధితుని తరుపు వారికి రూ.83 లక్షల చెక్కును అందజేశామన్నారు.

అమ్మమ్మ మృతితో..

● హత్యకు గురై రెండేళ్ల కిందట తల్లి..

● అనారోగ్యంతో తండ్రి తనువు చాలించారు ● కొండపేటలో విషాదగాథ

అనాథలుగా చిన్నారులు



మృతదేహం వద్ద అమాయకంగా ఉన్న చిన్నారులు

చెన్నూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభం.. శుభం.. తెలియని ఆ చిన్నారులను చూస్తే మానవత్వం వున్న వారెవరైనా కంటతడి పెట్టాల్సిందే. పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ బిడ్డలు కన్నవారి ప్రేమకు దూరమయ్యారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో వారిని అమ్మమ్మ అక్కున చేర్చుకుంది. అప్పటి నుంచి ఆలనా పాలన చూసుకొనేది. కానీ విధి ఆడిన ఆటలో ఆ చిన్నారులు ఓడిపోయారు. అనారోగ్యంతో అమ్మమ్మ కూడా శనివారం తనువు చాలించడంతో ఆ బిడ్డలు అనాథలుగా మిగిలిపోయారు. ఇది చూసిన వారంతా అయ్యో.. పాపం.. ఎంత పని చేశావు దేవుడా.. అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. వివరాల్లోకెళ్తే.. అనంతపురం జిల్లా వడియంపేట గ్రామానికి చెందిన కె.రంగనాయకులు, ఆయన భార్య జ్యోతి, అతని అత్త రాజమ్మ కొండపేటలో ఓ ఇంటిని బాడుగకు తీసుకుని కూలి పనులు చేసుకుని జీవించేవారు. వీరికి రాజేశ్ (10), శ్రీకర్ (8)లు ఉన్నారు. ఇది లావుండగా రెండు సంవత్సరాల క్రితం ఆ చిన్నారుల తల్లి జ్యోతి హత్యకు గురికాగా, 10 రోజుల కిందట తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి వారి ఆలనా పాలన అమ్మమ్మే చూసుకొనేది. కానీ తండ్రి పెద్దకర్మ జరిగిన మరుసటి దినమే కంటికి రెప్పలా చూసుకొనే అమ్మమ్మ సైతం అనారోగ్యంతో శనివారం అశువులు బాసింది. ఈమెకు గతంలో గెండెకు సంబంధించిన సమస్య వుండేది. ఇటీవల ఆపరేషన్ కోసం పుట్టపర్తి వెళ్లగా అక్కడ చికిత్స చేయించుకుంటూ చనిపోయింది. ఆమె శవాన్ని కొండపేటకు తీసుకువచ్చారు. దీంతో ఆ చిన్నారుల పరిస్థితి ఓ విషాద గాథగా మిగిలింది. కాగా ఈ కష్టం ఏ కుటుంబానికి రాకూడదని, ప్రభుత్వం వారికి ఏదో ఒక దారి చూపించి ఆదుకోవాలని గ్రామ స్తులు కోరుతున్నారు. వీరితో పాటుగా గ్రామ మాజీ సర్పంచ్ మన్నె మోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఆ కుటుంబానికి ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కాగా చిన్నారుల భవితకు దాతలెవరైనా సహకరించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తీర్థయాత్రకు వెళ్లిన మహిళ గుండెపోటుతో మృతి



ఉషారాణి (ఫైల్)

సిద్దవటం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల్లో భాగంగా గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిన సిద్దవటం గ్రామానికి వెళ్లిన మహిళ గుండెపోటుతో గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... స్థానికంగా నివసించే సూర్యనారాయణ, తన భార్య ఉషారాణి (60)తో కలిసి డిసెంబరు 5న తీర్థయాత్రలకు వెళ్లారు. 12వ తేదీ గురువారం ఉదయం గుజరాత్‌లోని సోమనాథ్‌లో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 8.30 గంటల సమయంలో గుండెపోటు రావడంతో ఉషారాణి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో సమీపంలోని ఆస్పత్రికి ఆమెను తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి ఆమె మృతదేహాన్ని సిద్దవటంలోని వారి ఇంటికి తీసుకురాగా, శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె 20 ఏళ్లుగా సాయిగణేష్ డ్వాక్రా సంఘం లీడర్‌గా మంచి గుర్తింపు పొందారు

రేపు జిల్లా కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపిక కార్యక్రమం ఈ నెల 16న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక డీఎస్‌ఏ క్రీడా ప్రాంగణంలో జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సి.కొండయ్య తెలిపారు. ఇందులో పాల్గొనే ఔత్సాహిక క్రీడాకారుల వయస్సు 2005 జనవరి 12 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. కాగా బాలుర బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీల లోపు వుండాలన్నారు. హాజరయ్యే వారు తప్పక వారి ఒరిజినల్ ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో జరగనున్న అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందన్నారు. వివరాలకు 9866719473ను సంప్రదించాలని కోరారు.

అట్టహాసంగా కాశిరెడ్డినాయన ఉత్సవాలు ప్రారంభం

● దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● పటిష్టమైన బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు

● భక్తుల కోసం సువిశాలమైన చలువ పందిర్లు

● విస్తృతంగా అన్నదానం



అన్నదానం కోసం వినియోగిస్తున్న కూరగాయలు



ప్రత్యేకంగా అలంకరించిన కాశినాయన పాలరాతి సమాధి

కాశినాయన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోతిక్షేత్రంలో శనివారం అవధూత కాశినాయన 29వ ఆరాధనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున రుద్రాభిషేకం, గణపతి పూజలతో కాశిరెడ్డినాయన రెండురోజుల ఆరాధనోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ప్రధానార్చకులు జీరయ్యస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆరాధనను పురష్కరించుకొని జ్యోతి క్షేత్రం కాశినాయన నామస్మరణతో మార్మోగిపోయింది. కాశినాయన గర్భగుడిలోని పాలరాతి సమాధితో పాటు పరిసరాల్లోని దత్తాత్రేయ, లక్ష్మీనరసింహస్వామి, అన్నపూర్ణాదేవి, రామాలయం తదితర ఆలయాలను రకరకాల పూలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలోని కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, అనంతపురం, చిత్తూరు తదితర జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు జ్యోతి క్షేత్రానికి స్వచ్ఛందంగా తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రం జనసంద్రంగా మారింది. ఆరాధనకు వచ్చిన భక్తులు కాశినాయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం లక్ష్మీ నరసింహస్వామి, అన్నపూర్ణేశ్వరి, దత్తాత్రేయ, ఆవు సమాధిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆరాధనకు వచ్చిన భక్తులతో అన్నదాన కౌంటర్లు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చలువ పందిళ్లు, నీటివసతి కల్పించారు. స్థానికులతో పాటు యర్రగుంట్ల, అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్, తాడిపత్రి, తదితర ప్రాతాలకు చెందిన భక్తులు వందల సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అనేక కార్యక్రమాల్లో విరివిగా సేవలందిస్తున్నారు. కాశినాయన ఆరాధనకు వచ్చిన భక్తులు తమతో పాటు అన్నదానానికి తమకు తోచిన మేర ఆర్థిక సాయంతో పాటు బియ్యం, బేడలు, కూరగాయలు, ప్లేట్లు ఇతర వస్తువులు కానుకలుగా అందిస్తున్నారు. రాత్రి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం నిర్వహించారు. డా.ప్రశాంతి ఆధ్వర్యంలో నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందజేశారు. మైదుకూరు డీఎస్పీ అధ్యక్షతన పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ హనుమంతు పర్యవేక్షణలో దాదాపు 175 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు వందల సంఖ్యలో ప్రైవేట్ వాహనాల్లో భక్తులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృతంగా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ భక్తులకు సేవలందించారు.

రూ.60 వేల నగదు చోరీ



పైకప్పు రేకులు కోసిన దృశ్యం

చాపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో మహేశ్వర్‌రెడ్డికి చెందిన దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి రూ.60 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తూ ఎస్‌బీఐ ఏజెంట్‌గా ఉండేవాడు. ప్రజలతో లావాదేవీలు జరుపుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కొంత నగదు, సెల్‌ఫోన్ షాపులోనే ఉంచి ఇంటికి వెళ్లాడు. కాగా అదేరోజు అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు దుకాణం పైకప్పు రేకులను మిషన్‌తో కోసి దుకాణంలోకి దిగి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల పొడవుతో రేకులను కోసి రంధ్రం వేశారన్నారు. దుకాణదారుడు లక్ష్మీపేట గ్రామానికి చెందినవాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రతి బిడ్డకు తల్లి ప్రథమ గురువు

● ప్రభుత్వ విప్ మాధవి, వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి బిడ్డకు తమ తల్లులే ప్రథమ గురువులని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, వైవీయూ వైస్ చాన్స్‌లర్ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. శనివారం కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల కంటే గురువు పాత్ర చాలా ప్రధానమైందని, గురువు ఆశీస్సులతో, గురువు అందించిన విజ్ఞానంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని, అందుకు ప్రత్యక్ష నిదర్శనం తానేనని చెప్పారు. మహిళలకు తగిన విశ్రాంతి, రక్షణ అవసరమని మహిళలకు, మహిళాభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలు, అవకాశాలు అవసరమని ఒక మహిళ, ఎమ్మెల్యేగా మహిళల అభ్యున్నతికి, రక్షణ కోసం తనవంతు కృషిచేస్తానని తెలియజేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వ్యక్తులని కుటుంబంలో గాని, కార్యాలయంలో గాని మహిళల పాత్ర చాలా ప్రధానమైనదన్నారు. ప్రతి బిడ్డకు తన తల్లే ప్రథమ ఉపాధ్యాయురాలన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు, కళాశాలలో పనిచేసిన అధ్యాపకులు, ప్రధాన ఆచార్యులు హాజరయ్యారు. విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఓ.విజయలక్ష్మి, విశ్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, పూర్వ ప్రధానాచార్యులు సంజీవమ్మ, ప్రేమలత, రాజమ్మ, రంగారెడ్డి, డాక్టర్ బీఆర్ శైలజ, చరిత్ర అధ్యాపకులు రజియ సుల్తానా, అర్థశాస్త్ర అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివపార్వతి, మాజీ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి హాజరయ్యారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వర్ణోత్సవాలకు సంబంధించి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను రంజింపజేశాయి. హాజరైన ప్రముఖులను కళాశాల ప్రిన్సిపల్, అలుమ్ని అసోసియేషన్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత

కడపకలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ, డీఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల నిర్బంధం !

● ఆకలి దప్పికతో మూగవేదన

● న్యాయం కోసం బాధితుల మొర



పశువుల రాకపోకలకు అడ్డంగా నాటిన బండలు



నిర్బంధంలో ఉన్న పశువులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య నెలకొన్న పంతాలు, పట్టింపుల ముందు మూగజీవాల ఆవేదన ఓడిపోయింది. మమతలు మరచి స్వార్థాలు తెచ్చిన తంటా నోరు లేని జీవాలకు మూగ వేదన మిగిల్చింది. ప్రాణం విలువ మరచిన ఓ మనిషీ... మాపై దయచూపవా అంటూ కాలే కడుపుతో కార్చిన కన్నీటి రోధన మానవ హృదయాలను కదిలించలేకపోయింది. మూడు రోజులపాటు తాగేందుకు నీరు లేక, తినేందుకు ఆహారం లేక బయటకు కదలలేక తమ బాధ మానవత్వాన్ని గుర్తు చేయించలేక దయనీయ స్థితిలో రాత్రింబవళ్లు ఆ మూగజీవాలు గడిపాయి. మూగ జీవాలకు వచ్చిన కష్టం తీర్చమని యజమానురాలు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి తమ గోడును విన్నవించుకున్నారు. తమకు వచ్చిన కష్టం తీర్చమని అధికారుల చుట్టూ తిరిగి మూగజీవాల కడుపు నింపే మార్గం కోసం తపన పడ్డారు. ఇదేదో పట్నం సొగసుల మధ్య జరిగిన ఘటన కాదు మూగజీవాల పుట్టినిల్లు అయిన పల్లెసీమల్లో చోటు చేసుకున్న దయనీయ గాథ...

ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన మేకల చెన్నమ్మ, శ్రీనివాసులు భార్య మేకల లక్ష్మీదేవి వివరాల మేరకు చెన్నమ్మ భర్త గంగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతిచెందారు. అప్పటి నుంచి చెన్నమ్మ వరుసకు కుమారుడు అయ్యే శ్రీనివాసుల వద్ద ఉంటూ తన బాగోగులు చూసుకునేలా ఏర్పాటు చేసుకుంది. వీరికి మూడు ఎనుములు, రెండు ఆవులు, మూడు దూడలు ఉన్నాయి. చెన్నమ్మ, శ్రీనివాసులుకు అతని సోదరులు వెంకటసుబ్బయ్య, నాగార్జుల మధ్య ఆస్తి బాగపరిష్కార విషయంలోనూ, రస్తా వివాదంలోనూ మనస్పర్థలు ఉన్నాయి. దీంతో వారు శ్రీనివాసులుకు చెందిన పశువులు ఉంచే ఇంటి ముందు ఈ నెల 11వ తేదీన బండలు నాటారు. ఈ నేపథ్యంలో ఆరోజు జరిగిన ఘర్షణలో శ్రీనివాసులు తీవ్ర గాయాలపాలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బండలు నాటడంతో జీవాలు బయటకు రాలేక వాటికి నీరు, ఆహారం అందించేందుకు వీలు లేకుండా పోయిందని బాధితులు తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారు గంగయ్యను కలిసి వినతిపత్రం అందించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. దీంతో రూరల్ ఎస్‌ఐ రఫి శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకుని వెళ్లారని పేర్కొన్నారు. అయినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని చెన్నమ్మ, శ్రీనివాసులు భార్య లక్ష్మీదేవి వాపోయారు. చివరికి చేసేది లేక పశువులు ఉంచిన ఇంటి గోడ బండలను తొలగించి ఒక రంధ్రాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా పశువులకు నీరు, గడ్డి, ఆహారం అందిస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా సాగునీటి ఎన్నికలు


ములకలచెరువులో సాగునీటి సంఘ సభ్యులతో జయచంద్రారెడ్డి


మదనపల్లెలో ఎన్నికైన నూతన సాగునీటి సంఘ సభ్యులు


కలకడలో ఎన్నికైన చైర్మన్లు, సభ్యులతో అధికారులు

మదనపల్లె/ టౌన్/ అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని నాలుగు సాగునీటి చెరువులకు సంబంధించి శనివారం నిర్వహించిన నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని సీటీఎం పెద్దచెరువు, చిన్నారాయనచెరువు, లింగిశెట్టిచెరువు, వెంకటమ్మ చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. ప్రతి సంఘానికి ఆరుగురు టీసీ సభ్యుల స్థానాలకు కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తరువాత మధ్యాహ్నం మూడు గంటలకు నాలుగు చెరువుల సంఘాలకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను టీసీ సభ్యులు ఎన్నుకున్నారు. లింగిశెట్టిచెరువుకు అధ్యక్షుడుగా పి.రాజన్న, ఉపాధ్యక్షుడుగా కృష్ణమూర్తి, వెంకటమ్మచెరువుకు అధ్యక్షుడుగా కె.శివయాదవ్, ఉపాధ్యక్షుడుగా చిన్నరెడ్డెప్ప ఎన్నికయ్యారు. సీటీఎం పెద్దచెరువుకు ప్రసాదనాయుడు, ఉపాధ్యక్షుడుగా సద్దాంహుస్సేన్, చిన్నాయనచెరువు అధ్యక్షుడుగా వేమన్న, ఉపాధ్యక్షుడుగా రాజేంద్ర ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఏవో నాగప్రసాద్, సీఎస్ డీటీ రెడ్డెప్పలు అబ్జర్వర్లుగా వ్యవహరించారు.

రెండు ప్రాజెక్టులు, 52చెరువులు ఏకగ్రీవం

మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు, నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టులతోపాటు 53 చెరువులకు శనివారం సాగునీటి సంఘాల ఎన్నికల్లో పెద్దమండ్యం మండలంలోని పాపిరెడ్డిచెరువు ఎన్నిక వాయిదా పడగా, మిగిలిన రెండుప్రాజెక్టులు, 52 చెరువులకు ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా సాగాయి. ఇందులో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం మండలాల్లో 38 చెరువులు, పెద్దేరు ప్రాజెక్టు ఉన్నాయి. అలాగే మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 15 చెరువులు, నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టు ఉన్నాయి. ఇందులో అన్ని చెరువులకు ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. అలాగే నిమ్మనపల్లె బహుదా ప్రాజెక్టులోని ఆరు టీసీల్లో ఒకటో టీసీకి ఎన్నిక జరగ్గా, మిగిలిన అయిదు టీసీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో రెండుప్రాజెక్టులు సహా చెరువులన్నీ కూటమి ప్రభుత్వమే గెలుచుకుంది. మదనపల్లె మండలంలోని చీకలబైలు వెంకటమ్మ చెరువు సాగునీటి సంఘం కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్ మండ్యెం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. వెంకటమ్మ చెరువు సాగునీటి సంఘం కమిటీ అధ్యక్షుడిగా కె.శివయాదవ్, ఉపాధ్యక్షుడిగా బి.చిన్నరెడ్డెప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఈ సందర్భంగా ఎన్నికైన సాగునీటి సంఘం సభ్యులను సర్పంచ్ మండ్యెం ప్రభాకర్‌తోపాటు టీడీపీ నాయకులు, అధికారులు అభినందించారు. మాజీ ఎంపీటీసీ మేడి పల్లె రాజన్న, కొల్లవారిపల్లె రాజన్న, సుబ్బిరెడ్డి, రమణ యాదవ్, బండి రాజ్‌కుమార్, మాజీ ఉప్పసర్పంచ్ జిల్లెళ్ల లక్ష్మన్న, రవీంద్ర, జోలాపేట నాయుడు, మేడిపల్లె వై.నరసింహులు, దినేష్‌రెడ్డి, లక్ష్మీదేవి, కృష్ణప్ప, కొక్కల హరి, హరి, ద్వారకనాథ్, రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: తంబళ్లపల్లె నియోజకవర్గంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం హర్షణీయమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులో నిపార్టీ కార్యాలయంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన ఆరు మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లు జయచంద్రారెడ్డిని కలిసి సంబరాలు చేసుకున్నారు. ములకలచెరువు పెద్దచెరువు అధ్యక్షుడిగా చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీరెడ్డి, దేవళచెరువు తిరుమలదేవరచెరువు అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామచంద్ర, గుడుపల్లె పెద్దచెరువు అధ్యక్షుడిగా గాలి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వెంకటనారాయణ, బురకాయలకోట గుమ్మసముద్రం చెరువు అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా హరినాథరెడ్డి, మద్దినాయనిపల్లె బాట్నాయని చెరువు అధ్యక్షుడిగా వెంకటరమణ, ఆంజనేయులు, అలంకనాయనిచెరువు అధ్యక్షురాలిగా రమణమ్మ, ఉపాధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, తిమ్మసముద్రం చెరువు అధ్యక్షుడిగా రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా పెద్ద మల్లికార్జున, సోంపల్లె పెద్దచెరువు అధ్యక్షుడిగా చలపతి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు ఓబులేసు, బూర్లపల్లె శ్రీనివాసులు, సికిందర్ పాల్గొన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐ నరసింహులు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

పీలేరులో ఏకగ్రీవంగా ముగిసిన ఎన్నికలు

పీలేరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలో శనివారం జరిగిన సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా ముగిశాయి. వైసీపీ నాయకులు ఈ ఎన్నికలను బహిష్కరించడంతో మండలంలో ఎన్నికలు జరిగిన మూడు సంఘాలను టీడీపీ కైవసం చేసుకుంది. అంతే కాకుండా చిత్తూరు జిల్లా సదుం మండల పరిధిలోకి వచ్చిన అగ్రహారం చెరువు సంఘాన్ని కూడా పీలేరు వాసి చేజిక్కించుకున్నారు. పీలేరు మండలం పీలేరు పట్టణంలోని అయ్యప్పనాయుని చెరువు అధ్యక్షునిగా పసల హరినాథ్, ఉపాధ్యక్షుడిగా అయ్యల నారాయణ, గూడరేవుపల్లె పంచాయతీలోని సూరప్ప చెరువు అధ్యక్షునిగా మాజీ సర్పంచ్ మూరే అన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా విశ్వనాథ్, చింతల చెరువు అధ్యక్షునిగా రాయల రమణ, ఉపాధ్యక్షునిగా మోకాటి ఎర్రయ్య గెలుపొందారు. సదుం మండల పరిధిలోకి వచ్చిన అగ్రహారం పెద్దచెరువు అధ్యక్షునిగా రామిరెడ్డిగారిపల్లెకు చెందిన బయ్యారెడ్డి వెంకటరమణా రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు, ఎంపీడీవో శివ శంకర్, ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, పీఆర్ ఏఈ రామకృష్ణ నాయక్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయం సంఘటనలు జరగకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐలు బాలకృష్ణ, లోకేశ్‌లు తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. సాగునీటి సంఘాల సభ్యులుగా ఎన్నికైన వారిని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఫోనులో అభినందించారు.

కలికిరిలో రెండు కమిటీలు ఏకగ్రీవం

కలికిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండలంలో రెండు సాగునీటి సంఘాల కమిటీలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధికార టీడీపీ చెందిన వారే రెండు సంఘాలకు ఎన్నికయ్యారు. కలికిరి పెద్దచెరువు కమిటీకి జి.రత్నశేఖర్ రెడ్డి అధ్యక్షుడుగా, ఎం.సుందరరాజుల శెట్టి ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. గుండ్లూరు బయ్యపురెడ్డి చెరు వు కమిటీ అధ్యక్షురాలుగా ఎం.శ్యామలమ్మ, ఉపాధ్యక్షుడుగా కె. నాగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తహసీల్దారు మహేశ్వరీబాయి, ఎంపీడీవో భానుమూర్తిరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా ముగిసాయి. ఇందులో నడిమి ఖండ్రిగ పెద్దచెరువు అధ్యక్షుడిగా డి.శేఖర్, ఉపాధ్యక్షు డిగా రావచంద్ర, హిమామ్‌బేగ్ చెరువు అధ్యక్షుడిగా సి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్, రామానాయునిచెరువు అధ్యక్షుడిగా కె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, రాశిచెరువు అధ్యక్షుడిగా ఎం.సీతారామయ్య, ఉపా ధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి, హరిహరాదులచెరువు అధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఖాదర్‌వలిలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఎంపీ డీవో వెంకటేశులు, తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు మొత్తం అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. మండలంలోని చింతపర్తి ఎగువరం గారెడ్డి చెరువు సంఘ ఎన్నికల్లో చైర్మన్‌గా సుబ్బారెడ్డి, వైస్‌చైర్మన్‌గా సుబ్రహ్మణ్యం, గండబోయనపల్లె సంఘ చైర్మన్‌గా అమృతనాథరెడ్డి, వైస్ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి, విఠలం రామస్వామి చెరువుకు సంబంధించి చైర్మన్‌గా ఎ.శివారెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రసాద్, తాటిగుంటపల్లె కొత్తచెరువు సంఘ చైర్మన్‌గా పి.రామకృష్ణరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎ.పెద్దరెడ్డెప్ప, టిసాకిరేవుపల్లె రాజుచెరువు సంఘ చైర్మన్‌గా కె.లక్ష్మీదేవి, వైస్ చైర్మన్‌గా ఈశ్వరమ్మ, కూరపర్తి గ్రామం చెరువు సాగు నీటి సంఘం చైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి, వైస్ కృష్ణయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ప్రసాద్ బాబు, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు తదితరులు ఎన్నికల అధికారులుగా పర్యవేక్షించారు.

కలకడలో:మండలంలోని రెండు నీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు తహశీల్దార్ ఫణికుమార్‌తెలిపారు. నవాబ్‌పేట పెద్దచెరువుకు అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, అలాగే గుడిబండ చెరువు అధ్యక్షుడిగా రామాంజులు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా తహశీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో అబ్దుల్ రహీంలు ఉన్నారు. ఎన్నికైన చైర్మెన్‌లను ఆయకట్టుదారులు అభినందించి సన్మానించారు.

కురబలకోటలో: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాతంతంగా నిర్వహించారు. మల్లేశ్వరమ్మ, చెరువు చైర్మన్‌గా పి.రమణారెడ్డి, వైస్ చైర్మన్‌గా తూట్ల కృష్ణప్పలను పెద్ద చెరువు చైర్మన్‌గా బీదం మల్లయ్య, వైస్ చైర్మన్‌గా మధునాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి తహశీల్థార్ తపశ్విని నియామక ధృవపత్రాలను అందజేశారు. ఎంపికైన కార్యర్గానికి టీడీపీ తంబళ్ళపల్లె నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జున నాయుడు, పి.సూరి, తూట్ల రవీంద్ర యాదవ్ తదితరులు అభినందించారు.

రామసముద్రంలో: మండలంలో శనివారం జరిగిన ఎనిమిది చెరువుల సాగునీటి సంఘ ఎన్నికల్లో చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో అతిపెద్ద చెరువైన అగ్రహారం చెరువు సాగునీటి సంఘ చైర్మన్‌గా పాలాబత్తుల వెంకటాచలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప్పునెల్లి చెరువు చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి, వడ్డివాని చెరువుకు పాల చెంగారెడ్డి, పాయచెరువుకు అమరప్ప, కనగాని చెరువుకు ఆర్‌కృష్ణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సాగునీటి సంఘ చైర్మన్‌లకు టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు శుభాకాంక్షలు తెలియజేశారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని ఐదు చెరువుల సాగునీటిసంఘాల ఎన్నికకు ప్రత్యేక అధికారులను నియమించి తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ ప్రక్రియను పర్యవేక్షించారు. పట్టణంలోని డేగానిచెరువుతోపాటు మూడు చిన్నచెరువుల సంఘ చైర్మన్‌గా ఆవుల రామచంద్ర, గట్టు పాపినాయునిచెరువు చైర్మన్ గా శెట్టినాగలాంబిక, గుమ్మసముద్రం పెద్దచెరువు చైర్మన్‌గా జల్లారామప్ప, బయప్పగారిపల్లి ఓబులనాయునిచెరువు చైర్మన్‌గా వి.మనోహర్‌రెడ్డి, బడికాయలపల్లె పెద్దచెరువు చైర్మన్‌గా రామచంద్రారెడ్డిలతో పాటు వైస్‌చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐ జీవన్ గంగాధర్‌బాబు బందోబస్తు సమీక్షించారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను కూటమి నాయకులు అభినందించారు.

పెద్దతిప్పసముద్రంలో:పెద్దతిప్పసముద్రం మండలంలో 7 చెరువులకు శనివారం సాగునీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించగా అన్ని ఏకగ్రీవంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రమైన పీటీఎం పెద్దచెరువు చైర్మన్‌గా కోట్లోని వెంకట్రమణారెడ్డి, వైస్ చైర్మన్‌గా కార్యం శంకర, రంగసముద్రం పెద్ద చెరువు చైర్మన్‌గా వరకల చెన్నకేశవ, వైస్ చైర్మన్‌గా కుమ్మర క్రిష్ణప్ప, మడుమూరు జంబుగానిచెరువు చైర్మన్‌గా గాజుల వరలక్ష్మీ, వైస్ చైర్మన్‌గా రామక్రిష్ణ, పులికల్లు వీరపనాయునిచెరువు చైర్మన్‌గా లక్షుమన్న, వైస్ చైర్మన్‌గా బాస్కర్ నాయుడు, టి.సదుం పెద్దచెరువు చైర్మన్‌గా గంగంపల్లె రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా చింతమాని నరేష్, టి.సదుం గ్రామం తుమ్మలచెరువు చైర్మన్‌గా పెద్దిరెడ్డిగారి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్‌గా వాసుదేవరెడ్డిగారి హరీష్, కందుకూరు వ్యాసరాయసముద్రం చెరువు చైర్మన్‌గా మండ్లిపల్లె రమేష్‌బాబు, వైస్ చైర్మన్‌గా అరికల వెంకటప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లను తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమండ్యంలో: మండలంలో జరిగిన సాగునీటి సంఘాలకు శనివారం చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. పాపిరెడ్డిచెరువు ఎన్నికలో కోరం లేక వాయిదా వేసినట్లు ఎంఈవో 2 రామకృష్ణ వెల్లడించారు. వెలిగల్లు పెద్దచెరువు చైర్మన్‌గా గిరిబాబు, వైస్ చైర్మన్‌గా సి.ఆశలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ వెల్లడించారు. లంపవంకచెరువు చైర్మన్‌గా చలపతినాయుడు, వైస్ చైర్మన్‌గా శంకర్ నాయక్, తిప్పిరెడ్డిచెరువు చైర్మన్‌గా రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా సయ్యద్ ఖాజాపీర్, లోతువంక చెరువు చైర్మన్‌గా నరసింహులు, వైస్ చైర్మన్ గా మల్లికార్జున, సిద్దవరం చెరువు చైర్మన్‌గా కిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ గా రవీంద్ర ప్రసాద్‌లు ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన సాగునీటి సంఘాల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు కూటమి మద్దతుదారులేనని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, సుమన్‌కుమార్, గాంగధర, క్రిష్టారెడ్డి, మహేశ్వర, కుంటకిందపల్లి చంద్రారెడ్డి నాగేశ్వరరెడ్డి, ప్రభాకరరెడ్డి, కాలేషా వెల్లడించారు.

తంబళ్లపల్లెలో: మండలంలో శనివారం జరిగిన సాగునీటిసంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల నిర్వహణాధికారులు సురేష్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ హరికుమార్‌లు తెలిపారు. మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్‌గా శివ కుమార్, వైస్ చైర్మన్‌గా శివయ్య, కన్నెమడుగు పెద్దచెరువు చైర్మన్‌గా మధుసూధన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి, బయమ్మచెరువు చైర్మన్‌గా ఆదిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా సురేందర్‌రెడ్డి, చెంద్రాయుని చెరువు చైర్మన్‌గా వెంకట్రమణారెడ్డి, వైస్‌చైర్మన్‌గా పెద్దప్పల్ల, కోటకొండ పెద్దచెరువు చైర్మన్‌గా చిన్నరెడ్డెప్ప, వైస్‌చైర్మన్‌గా కిష్నారెడ్డి, గోపిదిన్నె చెరువు చైర్మన్‌గా నరసింహారెడ్డి, వైస్‌చైర్మన్‌గా సుధాకర్ రెడ్డి, బాలిరెడ్డిచెరువు చైర్మన్‌గా జైహిం దొరెడ్డి, వైస్‌చైర్మన్‌గా రఘునాథ్‌రెడ్డి, అక్కమ్మ చెరువు చైర్మన్‌గా శివకుమార్ వైస్‌చైర్మన్‌గా వైస్‌చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి, రాతిచెరువు చైర్మన్‌గా రామలింగారెడ్డి, వైస్‌చైర్మన్ నరేంద్రకుమార్, పంచాలమర్రి పెద్దచెరువు చైర్‌పర్సన్‌గా రామసుబ్బమ్మ, వైస్ చైర్మన్‌గా శివప్రసాద్, అన్నగారిపల్లె ఆనకట్ట చైర్మన్‌గా సోమశేఖర్‌నాయుడు, వైస్‌చైర్మ న్‌గా జయరాం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

బాహుదా ప్రాజెక్టు సాగునీటి ఎన్నికల్లో ఉద్రిక్తత

- ఎన్నికలు నిలిపివేయాలంటూ ఓ వర్గం నిరసన
- ఆరు టీసీలకు గాను ఐదు ఏకగ్రీవం 1వ టీసీకి ఎన్నికలు

నిమ్మనపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో స్థానిక జడ్పీహైస్కూల్‌లో జరిగిన సాగునీటి ఎన్నికలు ఉద్రిక్తంగా మారా యి. శనివారం బాహుదా ప్రాజెక్టు మొత్తం 6టీసీలు ఉండగా వాటిలో 5టీసీలు ఏకగ్రీవం కాగా 1వ టీసీ మాత్రం ఎన్నికలు జరిగాయి. ఇందులో ఇద్దరు టీడీపీ మద్దతుదారులైన కూరపర్తి రెడ్డెప్ప రెడ్డి, బాలె రెడ్డెప్పలు నువ్వా నేనా అంటూ పట్టు వదలక పోవడంతో ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఎన్నికల అధికారి ధనంజేయులు 1వ టీసీ ఎన్నికలు నిర్వహించారు. అయితే కొందరు టీడీపీ నాయకులు సమయం అయిపోయిన తరువాత వచ్చి తమ నామినేషన్‌ను తీసుకోలేదని తమకు అన్యాయం జరిందంటూ ఎన్నికలు నిలిపివేయాలని నినాదాలు చేశారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ తిప్పేస్వామి ఎంత చెప్పినా వినకపోవడంతో వారిని అక్కడనుంచి బయటకు పంపి వేశారు. అనంతరం ఎన్నికలు పూర్తి కావడంతో టీడీపీ రెబల్ అభ్యర్థి కురపర్తి రెడ్డెప్పరెడ్డికి 114ఓట్లతో రెడ్డెప్పకు మాత్రం ఒక్క ఓటు పడకపోవడం గమనార్హం. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికకు సీన్ మొత్తం మారిపోయింది. అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే 6మంది టీసీలలో నలుగురు టీసీలు మద్దతుతో అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. కాగా 1వటీసీలో ఎన్నికైన రెడ్డెప్పరెడ్డికి మద్దతు లభించక పోవడంతో 6మంది టీసీలలో డవ టీసీలో ఏకగ్రీవం అయిన కె.దేవేంద్రరెడ్డిని అధ్యకునిగా నలుగురు టీసీలు ఎన్నుకొన్నారు. దీంతో తమకు రావలసిన అధ్యక్ష పదవి మరొకరికి రావడంతో ఇరువర్గాల నాయకులు ఒకరిపై ఒకరు కోపోద్రేకులై నానా బూతులు తిట్టుకొన్నారు. అనంతరం ఎన్నికల అధికారులు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షలను ప్రకటించారు. వారిలో బాహుదా ప్రాజక్టు అధ్యక్షుడిగా కె.దేవేంద్రరెడ్డి ఉపాధ్యక్షుడిగా నాగరాజ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఆహోబిలనాయుని చెరువుకు అధ్యక్షుడిగా జాఫర్‌అలిఖాన్, ఉపాధ్యక్షుడిగా మద్దూరి వెంకటరమణ, కోమిటివానిచెరువుకు అధ్యక్షుడిగా కడపల గురుప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ కొండవంక చెరువు అధ్యక్షుడిగా పుంగనూరు రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా జగన్నాధంలను ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, సీఐ రమేష్‌బాబు, ఎంఈవోలు పద్మావతి, నారాయణ, డీటీ బాబ్జి కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి రథోత్సవం



మదనపల్లె అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిప్పిలి గ్రామంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొల్పి ప్రత్యేకంగా అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అయ్యప్పస్వామి గ్రామోత్స వంలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఆల యం నుంచి అయ్యప్ప రథోత్సవం ఊరేగింపు ప్రా రంభమై కేరళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల, దేవరెద్దుల నడుమ వైభవం గా నిర్వహించారు. పురవీధుల్లో స్వామివారికి టెంకాయలు కొట్టి కర్పూహారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రాయల వారి రుచులు హోటల్ యాజమాన్యం వి.ఆంజనేయు లు, వి.శశికళ దంపతులు అయ్య ప్ప పడిపూజకు రెండు లక్షలు విరాళంగా ఇచ్చారు. గ్రామోత్సవం సందర్భంగా అయ్యప్ప భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు దాతలను పూలమాలతో, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అయ్యస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి సుధాకర్‌నాయుడు, విజయలక్ష్మీభాస్కర్, జర్మనీరాజు, భగవాన్, బాలకృష్ణ, కేశవ, ఆంజనేయులు, సోముశేఖర్, దంకనాచారి తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శనేశ్వరుడికి మహా తైలాభిషేకం


వాల్మీకిపురం ధర్మపథంలో విశేష పూజలందుకుంటున్న శనేశ్వరస్వామి

వాల్మీకిపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణ పడ మర పొలిమేర ల్లోని ధర్మపథం సమూహాలయంలో శనివారం షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనేశ్వరస్వామికి మహా తైలాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, డిసెంబరు 14(ఆంధ్ర జ్యోతి): పట్టణ పడ మర పొలిమేర ల్లోని ధర్మపథంలో ఆదివారం పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం కార్యసిద్ధి అభయాంజనేయస్వామికి అభిషేకాలు, పూజలు, సాయంత్రం సింధూర పూజ, ఆకుపూజ, వడమాల, తోమాల సేవలతో పౌర్ణమి వెలుగులో ప్రత్యేక పూజలు, రాత్రికి ఆలయ మండపంలో సత్యనారాయణ వ్రత వేడుకలు జరుగుతాయని ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేత రామకృష్ణ



మదనపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను, స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు బంగారు రామకృష్ణ కలిశారు. విజయవాడలోని పార్టీ కార్యా లయంలో శనివారం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి, స్థానికంగా ఉన్న సమస్యలు వివరించారు. అలాగే ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మదనపల్లె నియోజకవర్గ అబ్జర్వర్ శివరాంప్రతాప్ కూడా మంత్రిని కలసిన వారిలో ఉన్నారు. మదనపల్లె ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను మంత్రి లోకేశ్‌కు వివరించినట్లు వారు పేర్కొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ


టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న పార్టీ మైనార్టీ నేత ఎస్‌ఏ మస్తాన్

మదనపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ లభిస్తోందని టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌ఏ మస్తాన్ పేర్కొన్నారు. స్థానిక టమోటా మార్కెట్‌లో పార్టీ సభ్యత్వ నమోదును శనివారం ఆయన ప్రారంభించారు. ఇందులోభాగంగా మండీ వ్యాపారులు, కార్మికులు, రైతుల నుంచి రెండువేలకుపైగా సభ్యత్వాలు చేయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మస్తాన్ పేర్కొన్నారు. శనివారం జరిగిన నమోదులో 52మందికి సభ్యత్వం చేయించారు. ఇందులో పార్టీనాయకులు దాదాపీర్, బావాజాన్, వెంకటేష్, శివకృష్ణ, రసూల్, చలపతి, మహబూబ్‌బాషా, మురాషా, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కురబలకోట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండల పరిధిలో ఖాళీగా ఉన్న చౌకదుకాణాలకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 21 వరకు గడువును పొడిగించినట్లు తహశీల్దార్ తపశ్విని పేర్కొన్నారు. శనివారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కురబల కోట పంచాయతీలోని కురబలకోట(బీసీ-బి మహిళ), మద్దిరెడ్డిగారిపల్లె (ఓసీ), మట్లివారిపల్లె పంచాయతీ యర్రమద్దివారిపల్లె(బీసీ-డి), అంగళ్ళు పంచాయతీలో అంగళ్ళు-2(ఓసీ), మొలకవారిపల్లె(ఓసీ మహిళ), ముదివేడు(బీసీ-ఈ)లకు కేటాయించామన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 21లోగా పూర్తి చేసి దరఖాస్తులను తహశీల్దార్ కార్యాల యంలో అందజేయాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురబలకోట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ ముత్రవారిపల్లెకు చెందిన బి.రవీంద్ర(56) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతను ముదివేడు క్రాస్‌లో ఓ మహిళతో వివాహేతర బంధం కొనసాగిస్తూ ఆమె వద్దనే ఉంటున్నాడు. కాగా ఆమె ఇంట్లో మృతి చెందటంతో పలుఅనుమానాలకు దారి తీస్తుంది. అతని కళ్ళ వద్ద గాయాలు ఉండటంతో ఎవరైన హత్య చేశారా? లేక ఆత్మహత్య చేసుకున్నారా? అనేది అంతు బట్టడం లేదు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో రెవెన్యూ ఉద్యోగి మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కెవిన్(29) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఉద్యోగి కెవిన్ స్వగ్రామం ఆరోగ్యవరం. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ శనివారం ఆరోగ్యవరం చేరుకుని కెవిన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అతి చిన్న వయస్సులో కెవిన్ మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కెవిన్ మృతి పట్ల తహసీల్దార్ పామిలేటి, రెవెన్యూ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కుడుం కుటుంబానికి జయచంద్రారెడ్డి పరామర్శ

బి.కొత్తకోట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో అనారోగ్యంతో మృతిచెందిన కుడుం ఉదయకుమార్ కుటుంబాన్ని తంబళ్లపల్లె టీడీపీ నేత జయచంద్రారెడ్డి శనివారం పరామర్శించారు. నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులుకు ఉదయ్‌కుమార్ స్వయాన సోదరుడు కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి పార్టీల నేతలు అంత్యక్రియలకు సైతం హాజరైన విషయం తెలిసిందే. శనివారం జయచంద్రారెడ్డితో పాటు, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ లు బి.కొత్తకోటకు వచ్చి టీడీపీ నాయకుడు ఉదయ్‌కుమార్ కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. వారి వెంట టీడీపీ , బీజేపీ నాయకులు ఉన్నారు.

మిట్స్ అధ్యాపకుడి ప్రతిభ


అంతర్జాతీయస్థాయి సదస్సులో ప్రశంసాపత్రం అందుకుంటున్న అధ్యాపకుడు

కురబలకోట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకుడు అంతర్జాతీయస్థాయి సదస్సులో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఈసీఈ విభాగంలో పని చేస్తున్న అధ్యాపకుడు కుమార్ సింగపూర్‌లో జరిగిన ఐఈఈఈ సమ్మిట్‌లో పాల్గొని కమ్యూనికేషన్‌లో రంగంలో దేశవిదేశాల్లో సాంకేతిక పురోభివృద్ధిపై ఆయన పలు అంశాలకు సంబంధించి నిపుణుల సందేహాలను నివృత్తి చేశారు. దీంతో ఆయనను పలువురు ప్రొఫెసర్‌లు అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈసదస్సుకు వివిధ దేశాల నుంచి అధ్యాపకులు పాల్గొనగా మిట్స్ అధ్యాపకుడికి అవకాశం దక్కింది. ప్రతిభ కనబరిచిన అధ్యాపకుడిని కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ అభినందించారు.

ముగ్గురికి రూ.20లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం


లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ముగ్గురికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో రూ.20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. శనివారం స్థానిక ప్యారానగర్, కృష్ణనగర్, అమ్మచెరువుమిట్ట వద్ద ముగ్గురు లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా రూ.20 లక్షలు పంపిణీ చేశామని, దీని ద్వారా మూడు కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆసరాగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, లబ్దిదారులు ప్రభావతి, హర్షవర్ధన్, రహీమున్నీసా పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

మదనపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సినియారిటీ ప్రాతిపాదికన క్రమబద్ధీకరణ చేయాలని అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం ఐదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులం కాబట్టి తమకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలక్రిష్ణ, కార్యదర్శి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రత్నకుమార్, కోశాధికారి సజాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం

ములకలచెరువు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకుచెట్టుపల్లెలో ఆత్మహత్య చేసుకున్న రైతు బయ్యారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ హామీ ఇచ్చారు. శనివారం రైతు కుటుంబ సభ్యులను పరామర్శించి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడారు. రైతు పిల్లల చదువుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. సహకార సెల్ రాష్ట్ర కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, మనోహర్‌గౌడ్, మోహన, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.